ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక
ఆంధ్రజ్యోతి దిన పత్రిక కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు, ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఏవైనా సమస్యలుంటే క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
A.C.O - 9003200801
S.R - 9551168092
27/11, సౌందరరాజన్ స్ట్రీట్, టి.నగర్, చెన్నై-600017



కొనుగోలు దారులతో కిక్కిరిసిన టి.నగర్ రంగనాథన్ వీధి

పల్లెకు పోదాం.. చలో చలో!

పొంగల్ సెలవులకు సొంతూళ్లకు తరలివెళ్తున్న జనం

బస్సులు, రైళ్లు కిటకిట

ఒకే రోజు 1.87 లక్షల మంది ప్రయాణం

ప్యారీస్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): పొంగల్ పండుగను పురస్కరించుకుని వరుస సెలవులు రావడంతో రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం సాయంత్రం నుంచే ప్రజలు సొంతూళ్లలో పండుగ జరుపుకొనేందుకు తరలివెళ్తున్నారు. దీంతో బస్‌స్టేషన్లు, రైల్వేస్టేషన్లు ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. టిక్కెట్లు రిజర్వేషన్ చేసుకున్న వారు ప్రశాంతంగా, లేనివారు చివరి నిమిషంలో ఆందోళనతో తమ కుటుంబ సభ్యులతో బయలుదేరి వెళ్తున్నారు. చెన్నై నుంచి ఒక్క రోజులో సుమారు 1.87 లక్షల మంది తరలివెళ్లినట్లు అధికారులు చెబుతున్నారు. సొంతూళ్లకు వెళ్లే ప్రజల సౌకర్యార్థం ప్రధాన నగరాల నుంచి గ్రామాలకు అదనంగా 1,560 ప్రత్యేక బస్సులను రాష్ట్రప్రభుత్వ రవాణా సంస్థలు నడుపుతున్నాయి. కాగా కోయంబేడు, మాధవరం, కీలంబాక్కం బస్ టెర్మినల్ నుంచి 1,445 ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. ఈ మూడు ప్రాంతాలకు ప్రజలు సులువుగా వెళ్లేందుకు వీలుగా మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్టు కార్పొరేషన్ (ఎంటీసీ) సంస్థ నగరంలోని పలు ప్రాంతాల నుంచి 320 లింకు బస్సులను నడుపుతున్నట్లు అధికారులు తెలిపారు.

ట్రాఫిక్ రద్దీ...

ఉదయం కార్యాలయాలకు వెళ్లి సాయంత్రం ఇళ్లకు తిరిగొచ్చేవారు, మరోవైపు సొంతూళ్లకు వెళుతున్న వారు ప్రధాన రహదారులలో ఒకే చోట గుమిగూడుతుండడంతో నగర శివారు ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ నెలకొంది. రాజీవ్‌గాంధీ రోడ్డు, జీఎస్టీ రోడ్డు, పూందమల్లి హైరోడ్డు, ఈస్ట్‌కోస్ట్ రోడ్డు, తాంబరం, త్రిశూలం, వండలూర్ తదితర ప్రాంతాలలోని రహదారులు వాహనాల రద్దీతో కనిపిస్తున్నాయి. ట్రాఫిక్‌ను అధిగమించి బస్‌స్టేషన్లకు చేరుకున్నవారి కోసం ప్రభుత్వ రవాణా శాఖ అదనంగా రిజర్వేషన్ కౌంటర్లు, సమాచార కేంద్రం, ఆటోమేటిక్ టికెట్ ప్రింటింగ్ యంత్రాలను ఏర్పాటు చేసింది. వీటిని సద్వినియోగం చేసుకొని ప్రజలు సొంత ఊళ్లకు ఉత్సాహంగా బయలుదేరి వెళ్తున్నారు. కారు, వ్యాన్, మినీ బస్ తదితర వాహనాల్లో వెళ్తున్న వారి వల్ల ట్రాఫిక్ అంతరాయం కలగకుండా నగరం నుంచి బయలుదేరే వాహనాలు తాంబరం, పెరుగళత్తూర్ల మీదుగా వెళ్లకుండా వండలూర్ అవుటర్ రింగ్ రోడ్ల మీదుగా వెళ్లాలని ట్రాఫిక్ విభాగం హెచ్చరికలు జారీ చేసి ప్రధాన మార్గాల్లో బోర్డులు కూడా ఏర్పాటు చేసింది.

ఆమ్నీ బస్సులు...

పండుగ రోజుల్లో సాధారణ రుసుం కంటే రెండింతలు టికెట్టు చార్జీలు వసూళ్లు చేస్తున్నట్లు ఆమ్నీ బస్సుల యాజమాన్యంపై ప్రజలు ఫిర్యాదు చేస్తున్నారు. అయితే అధిక చార్జీలు వసూళ్లు చేయడం లేదని, ఆమ్నీ బస్సుల యజమానులు మీడియాకు తెలిపారు. రాష్ట్రప్రభుత్వం నిర్ణయించిన టికెట్లు ధరలనే వసూలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఒకవేళ ఆమ్నీ బస్సులలో ప్రయాణించే వారి నుంచి అధిక చార్జీలు వసూలు చేస్తే నెం.9043379664 కు ఫిర్యాదు చేయవచ్చన్నారు. ప్రత్యేక బస్సు సేవల గురించి రవాణా శాఖ అధికారులు మాట్లాడుతూ... పండుగ రోజుల్లో నడిపే ప్రత్యేక బస్సుల వివరాలు, ఫిర్యాదుల గురించి నెం.9445014436ను సంప్రదించవచ్చు. కాగా డాక్టర్ ఎంజీఆర్ సెంట్రల్ రైల్వే స్టేషన్, ఎగ్మోర్, తాంబరం, బీచ్, పెరంబూర్ సహా ప్రధాన రైల్వేస్టేషన్లలో ప్రయాణికుల సందడి నెలకొంది.



కిటకిటలాడుతున్న కోయంబేడు బస్టాండ్

పొంగల్ సందర్భంగా 44,580 ప్రత్యేక బస్సులు

ఐసిఎఫ్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పొంగల్ పండుగ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా 44,580 ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు రవాణా శాఖ మంత్రి శివశంకర్ తెలిపారు. పొంగల్ పండుగను స్వగ్రామాల్లో జరుపుకొనేందుకు వెళ్లే ప్రజల సౌకర్యార్థం 21,904 బస్సులు నడుపుతున్నామన్నారు. అలాగే, పండుగ ముగించుకొని నగరాలకు తిరిగొచ్చే వారి కోసం 22,676 బస్సులు నడుపుతున్నట్లు మంత్రి తెలిపారు.

నాన్నా అనే ఆ పిలుపే మా పాలనకు కితాబు

అభివృద్ధిని చూసి ఓర్వలేకే గవర్నర్ వాకౌట్

ఏడోసారి అధికారంలోకి వస్తాం

● టంగ్‌స్టన్ తవ్వకాలు జరగనివ్వం: సీఎం

చెన్నై, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ద్రావిడ తరహా డీఎంకే పాలనలో మహిళా సంక్షేమానికి అమలు చేస్తున్న పథకాల వల్ల లబ్ధిపొందుతున్న మహిళలంతా తనను 'నాన్నా..! నాన్నా' అని పిలుస్తుండటం తనకెంతో సంతోషాన్ని కలిగిస్తోందని, ఆ పిలుపొక్కటే సుపరిపాలనకు నిదర్శనమని సీఎం స్టాలిన్ అన్నారు. ఇప్పటి వరకు తాను 12వేల ఫైళ్లపై సంతకాలు పెట్టానని, వాటిలో సంక్షేమ పథకాలకు సంబంధించినవే అధికంగా ఉన్నాయన్నారు. శనివారం ఉదయం గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలు ముగిసిన తర్వాత ఆయన ప్రసంగిస్తూ మూడున్నర సంవత్సరాలుగా సాగుతున్న డీఎంకే పాలనను చూసి ప్రజలంతా మెచ్చుకుంటున్నారని, వారి మద్దతుతో ఏడోసారి అధికారంలోకి వస్తామన్నారు. ముఖ్యమంత్రిగా పదవీ స్వీకారం చేసిన రోజు వెలుగుబాట పయనం పేరుతో మహిళలకు సిటీ, టౌన్ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే పథకానికి సంబంధించిన ఫైలుపైనే తొలి సంతకం చేశానని, ప్రస్తుతం ఉచిత ప్రయాణం చేస్తున్న మహిళలంతా వారు ప్రయాణించే బస్సులను 'స్టాలిన్ బస్సులు' అని పిలుస్తుండటం తనకెంతో గర్వకారణంగా ఉందన్నారు.

గవర్నర్ తీరు విచిత్రం...

గత మూడేళ్లుగా శాసనసభలో గవర్నర్ ప్రవర్తిస్తున్న తీరును గమనిస్తే 'ఈ న్యాయస్థానం ఎన్నో విచిత్రమైన కేసులను ఎదుర్కొన్నది' అంటూ మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి పరాశక్తి చిత్రంలోని కోర్టు సీన్‌లో రాసిన డైలాగ్ గుర్తుకు వస్తోందన్నారు. 'యేటా గవర్నర్ ప్రసంగం చేయడానికి వస్తారు, ప్రసంగించకుండానే వెళతారు, లేకుంటే జాతీయ గీతం వినిపించాలంటూ చిన్నపిల్లాడిలా ప్రవర్తిస్తారు' అన్నారు. రాజ్యాంగ ధర్మాసనం 176వ సెక్షన్ ప్రకారం ప్రభుత్వం అందించే ప్రసంగాన్ని యథాతథంగా పఠించాలన్న విషయాన్ని గవర్నర్ గుర్తించడమే లేదన్నారు. 2021లో గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించిన గవర్నర్ 2022లో శాసనసభ తొలి సమావేశంలో ప్రభుత్వ ప్రసంగాన్ని ఫుల్‌స్టాప్‌లు, కామాలను కూడా వదలకుండా ఉన్నదున్నట్లుగా పఠించారని, గత మూడేళ్లుగా కుంటిసాకులు చెబుతూ గవర్నర్ ప్రసంగపాఠాన్ని చదవడమే మానుకున్నారని, శాసన సభలో ముఖ్యమంత్రిగా ఉన్న తాను ఆయన దృష్టిలో సాధారణమైన వ్యక్తిగా అగుపించవచ్చును గానీ, శాసనసభ సామాన్యమైనది కాదనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. రాజకీయ దురుద్దేశంతో గవర్నర్ ప్రవర్తిస్తున్న తీరు ఈ సభ ఇప్పటివరకూ చూడని దృశ్యాలన్నారు. రాజకీయపరంగా గవర్నర్ తమను తూలనాడటాన్ని పెద్దగా పటించుకోమని, ద్రావిడ ఉద్యమమే ఇతరుల ఉదాశీనతలను ఎదుర్కొని ఆవిర్భవించిందన్న విషయాన్ని ఎవరూ మరువరని స్టాలిన్ అన్నారు.

ప్రదర్శనలకు అనుమతి...

ప్రజా సమస్యలపై ప్రదర్శనలు నిర్వహించేందుకు పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తూ అనుమతి ఇవ్వడం లేదని అన్నాడీఎంకే, బీజేపీ చేస్తున్న ఆరోపణల్లో పస లేదన్నారు. ఆందోళన చేసేందుకుంటూ కొన్ని ప్రాంతాలను ఎంపిక చేసుకున్నామని, ఆ ప్రాంతాల్లో ఆందోళన జరిపేందుకు ఒకటిరెండు రోజులకు ముందు అనుమతి కోరితే పోలీసులు తప్పకుండా ఇస్తారని చెప్పారు. ఇక శాసనసభకు అన్నాడీఎంకే సభ్యులు నల్లచొక్కాలు ధరించి రావటం తనకెలాంటి ఆగ్రహం కలిగించలేదని, ఆ పార్టీకి దమ్ముంటే శాసనసభను వరుసగా అవమానపరుస్తున్న గవర్నర్‌కు వ్యతిరేకంగానో, లేదా రాష్ట్రానికి నిధులివ్వకుండా ఉన్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని ఖండిస్తూనో ఆందోళన జరపాలన్నారు. మహిళలపై జరిగే లైంగిక వేధింపులకు సంబంధించిన కేసులను విచారణ జరిపేందుకు రాష్ట్రంలో ఏడు ప్రత్యేక కోర్టులను చెన్నై, మదురై, తిరునల్వేలి, కోయంబత్తూరు, తిరుచ్చి నగరాల్లో ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు.



శాసనసభలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

టంగ్‌స్టన్‌పై అనుమానాలు వద్దు...

టంగ్‌స్టన్ తవ్వకాలపై ప్రతిపక్షాలు అదే పనిగా ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నాయని, ఈ విషయమై ఇదివరకే తాను స్పష్టమైన ప్రకటన చేశానని, ఈ తవ్వకాలకు మద్దతుగా అన్నాడీఎంకే ఎంపీ తంబిదురై పార్లమెంట్‌లో ప్రసంగించారని, డీఎంకే సభ్యులు వ్యతిరేకిస్తూ మాట్లాడారని చెప్పారు. ఇక మదురై సమీపం మేలూరు వద్ద టంగ్‌స్టన్ తవ్వకాలు జరిగితే తాను ముఖ్యమంత్రిగా ఉండే ప్రసక్తేలేదని కూడా ఇంతకుమునుపే స్పష్టంగా తెలిపానని స్టాలిన్ పేర్కొన్నారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంలో 10 సభ్యులు 112 సవరణలు ప్రతిపాదించారని, అవన్నీ ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని సవరించి ఈ తీర్మానాన్ని ప్రతిపాదిస్తున్నానని, సభ్యులందరూ ఈ తీర్మానాన్ని ఆమోదించాలని స్టాలిన్ తన ప్రసంగాన్ని ముగించారు. ఆ తర్వాత మూజువాణి ఓటు ద్వారా తీర్మానం నెరవేరినట్లు స్పీకర్ అప్పావు ప్రకటించి సభను నిరవధికంగా వాయిదా వేశారు.

ముగిసిన శాసనసభ సమావేశాలు

● గవర్నర్ నిష్క్రమణతో ఆరంభం

● అతివల భద్రత ముసాయిదా చట్టంతో ముగింపు

చెన్నై, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): కొత్త యేడాదిలో రాష్ట్ర శాసనసభ తొలి సమావేశాలు శనివారం ముగిశాయి. ఈనెల 6న ప్రారంభమైన ఈ సమావేశాలు ఆరు రోజులపాటు కొనసాగాయి. తొలి రోజు గవర్నర్ ఆర్‌ఎన్ రవి జాతీయ గీతాన్ని వినిపించలేదంటూ అలకపాన్పు పాటించి ప్రభుత్వ ప్రసంగ పాఠాన్ని చదవకుండా నిష్క్రమించారు. ఇలా పఠించకుండా వెళ్లటం ఇది మూడోసారి అని సభ రికార్డుల్లో నమోదైంది. ఆ తర్వాత సభాపక్ష నాయకుడు దురైమురుగన్ ప్రభుత్వ ప్రసంగ పాఠాన్ని యథాతథంగా ఆమోదిస్తూ సభ రికార్డుల్లో పొందుపరచాలని ప్రత్యేక తీర్మానం చేశారు. ఆ తీర్మానం ప్రకారం స్పీకర్ అప్పావు గవర్నర్ ప్రసంగ పాఠం తమిళ అనువాదాన్ని చదివి వినిపించడంతో తొలిరోజు సమావేశం ముగిసింది. మరుసటి రోజు మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్, ఈరోడ్ ఈస్ట్ సిట్టింగ్ శాసనసభ్యుడు ఈవీకేఎస్ ఇళంగోవన్ మృతికి సంతాప తీర్మానాలను స్పీకర్ ప్రవేశపెట్టారు. దీంతో రెండో రోజు సమావేశం ముగిసింది. మూడో రోజు గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై సీఎం స్టాలిన్ ప్రసంగించారు. ఈ సమావేశాల్లో అన్నా విశ్వవిద్యాలయంలో విద్యార్థినిపై జరిగిన అత్యాచారం సంఘటన, గత అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో పొల్లాచ్చి వద్ద జరిగిన సామూహిక అత్యాచారాలపై ప్రధాన ప్రతిపక్షం, పాలకపక్షం మధ్య తీవ్రస్థాయి చర్చలు జరిగాయి. ఇక శుక్రవారం సీఎం స్టాలిన్ మహిళలపై అత్యాచారాలకు పాల్పడే దోషులకు మరణశిక్ష పడేలా సభలో ముసాయిదా చట్టాన్ని ప్రవేశపెట్టారు. శనివారం సభ ముగింపు సమయంలో ఆ చట్టాన్ని అన్ని పార్టీలకు చెందిన సభ్యులు ఆమోదంతో ఆమోదించినట్లు స్పీకర్ ప్రకటించారు. శనివారం ముఖ్యమంత్రి స్టాలిన్ గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై సభ్యులు లేవనెత్తిన అంశాలను ప్రస్తావిస్తూ ప్రసంగించారు. ఆ ప్రసంగంలో గవర్నర్ తీరుపై విరుచుకుపడ్డారు. మహిళలపై జరిగే లైంగిక వేధింపుల కేసులను విచారణ జరిపేందుకు ఏడు ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఈ సమావేశాలకు ప్రధాన ప్రతిపక్షమైన అన్నాడీంకే సభ్యులు నల్లచొక్కాలు ధరించి, 'ఎవరా సార్?' అనే నినాదం ముద్రించిన బ్యాడ్జీలు కట్టుకుని హాజరయ్యారు. గవర్నర్ ప్రసంగించిన రోజే అన్నాడీఎంకే సభ్యులందరూ అన్నా విశ్వవిద్యాలయం అత్యాచార సంఘటనను ఖండిస్తూ వాకౌట్ చేశారు. పొల్లాచ్చి అత్యాచారాలపై పాలకపక్షం విరుచుకుపడినప్పుడు అసత్య ఆరోపణలు చేశారంటూ వాకౌట్ చేశారు. ఏది ఏమైనప్పటి తొలి యేడాది తొలి సమావేశాలు మొత్తం మీద ప్రశాంతంగానే ముగిశాయి.



వ్యాసర్పాడి డాన్‌బాస్కో స్కూల్లో శనివారం సాయంత్రం డీఎంకే ఆధ్వర్యంలో జరిగిన 'సమైక్య సంక్రాంతి' వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, దుర్గ దంపతులు పొంగల్ పంపిణీ చేస్తున్న దృశ్యం

ఈరోడ్ ఈస్ట్ బరిలో డీఎంకే

మిత్రపక్షానికి వదిలేసిన కాంగ్రెస్ ● డీఎంకే అభ్యర్థిగా చంద్రకుమార్ ● ఉపఎన్నికను బహిష్కరించిన అన్నాడీఎంకే, డీఎండీకే

చెన్నై, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ ఈస్ట్ శాసన సభ నియోజకవర్గం అచ్చిరాలేదనుకున్న కాంగ్రెస్ పార్టీ ఈసారి ఆ నియోజకవర్గంలో పోటీ నుంచి తప్పుకుంది. ఈ మేరకు టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై ప్రకటన చేస్తూ రాష్ట్రంలో ఇండియా కూటమికి నేతృత్వం వహిస్తున్న డీఎంకే అధ్యక్షుడు, సీఎం స్టాలిన్ కోరిక మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు. దీంతో ఆ నియోజకవర్గంలో డీఎంకే తరఫున పార్టీ రాష్ట్రస్థాయి ప్రచార కమిటీ డిప్యూటీ కార్యదర్శి వీసీ చంద్రకుమార్ పోటీ చేయనున్నట్లు ఆ పార్టీ ప్రకటించింది.



డీఎంకే అభ్యర్థి వీసీ చంద్రకుమార్

ఎన్నికకు దూరంగా...

ఇదిలా ఉండగా డీఎంకే అరాచకాలను నిరసిస్తూ ఈరోడ్ ఈస్ట్ నియోజకవర్గం ఉపఎన్నికను బహిష్కరిస్తున్నట్టు అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి, ఆ పార్టీ కూటమిలోని డీఎండీకే చీఫ్ ప్రేమలత శనివారం సాయంత్రం వేర్వేరుగా ప్రకటనలు జారీ చేశారు. దీంతో ఆ నియోజకవర్గంలో బీజేపీ, నామ్ తమిళర్ కట్చి వంటి పార్టీలు పోటీ చేసే అవకాశం ఉంది.

అన్నాడీఎంకేతో ప్రస్థానం

ఇక డీఎంకే అభ్యర్థి వీసీ చంద్రకుమార్ రాజకీయ ప్రస్థానం అన్నాడీఎంకేతో ప్రారంభమైంది. ఈరోడ్ జిల్లా కీరామడై ప్రాంతంలో నివసిస్తున్న ఆయనకు భార్య అముద, కుమారుడు, కుమార్తె ఉన్నారు. వృత్తిరీత్యా ఆయన జౌళి వ్యాపారం చేస్తున్నారు. 1987లో అన్నాడీఎంకేలో చేరి వార్డు కౌన్సిలర్‌గాను సేవలందించారు. ఆ తర్వాత కెప్టెన్ విజయకాంత్‌పై అభిమానంతో విజయకాంత్ అభిమానుల సంఘం జిల్లా శాఖ అధ్యక్షుడిగా పనిచేశారు. 2005లో విజయకాంత్ డీఎండీకేని ప్రారంభించినప్పుడు ఆ పార్టీ ప్రచార ప్రతినిధిగా నియమితులయ్యారు. ఈరోడ్ ఈస్ట్ నియోజకవర్గంలో మొదలియార్లే ఎక్కువగా ఉండటంతో అన్నాడీఎంకే కూటమిలోని డీఎండీకే తరఫున చంద్రకుమార్ పోటీకి దిగారు. ఆ ఎన్నికల్లో చంద్రకుమార్‌కు ప్రత్యర్థిగా ఇప్పటి మంత్రి ఎస్.ముత్తుసామి పోటీ చేసి పరాజయం పొందారు. 2016లో డీఎండీకే అధిష్టానంతో అభిప్రాయభేదాలు రావడంతో పార్టీని విడిచిపెట్టి డీఎంకేలో చేరారు. అదే యేడాది జరిగిన ఎన్నికల్లో ఈరోడ్ ఈస్ట్‌లో డీఎంకే తరఫున పోటీ చేశారు. అన్నాడీఎంకే తరఫున కేఎస్ తెన్నరసు పోటీ పడ్డారు. ఆ ఎన్నికల్లో చంద్రకుమార్ కంటే 7794 ఓట్లు అధికంగా పొందిన తెన్నరసు గెలిచారు. అటు పిమ్మట చంద్రకుమార్ డీఎంకే ప్రచార బాధ్యతలను ముమ్మరంగా నిర్వర్తిస్తూ వచ్చారు. 2023 లోక్‌సభ ఎన్నికల్లో తిరుచెంగోడు నియోజకవర్గానికి పార్టీ ఇన్‌చార్జ్‌గా పని చేశారు.



శనివారం చెన్నై క్యాంపు కార్యాలయంలో డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, పార్టీ నేతలను కలుసుకున్న ఆ పార్టీ ఈరోడ్ ఈస్ట్ నియోజకవర్గ అభ్యర్థి చంద్రకుమార్

ఆంధ్రజ్యోతి
కార్ అండ్ బైక్ రేస్



జనవరి నెల కూపన్ నంబర్ - 1

పాఠకుని పూర్తి పేరు	:	....
డోర్ నెంబరు	:	....
వీధి పేరు	:	....
గ్రామం / పట్టణం	:	....
మండలం	:	....
జిల్లా	:	....
పోస్టల్ పిన్‌కోడ్	:	....
ఫోన్ నంబర్	:	....

నాలుగు నెలల్లో ఆంధ్రజ్యోతి డ్రాలో ఇది జనవరి నెల మొదటి కూపన్ ఈ కూపన్‌లో మీ అడ్రస్ పూర్తి చేసి ఈ నెలలో ఇచ్చే మూడు కూపన్లను ఒక సెట్‌గా చేసి మీ వద్దనే ఉంచి రెండు నెలలు అయిన తర్వాత మొత్తం 6 కూపన్లను రెండు సెట్లుగా చేసి 2025 మార్చ్ నెల 10వ తేది నాటికి ఈ క్రింది అడ్రస్‌కు పోస్ట్ ద్వారా కాని, స్వయంగా కాని అందచేయవలెను.

నోట్ : సెట్‌గా కాకుండా విడిగా పంపిన కూపన్లు చెల్లవు.
* చట్ట ప్రకారం నిబంధనలు వర్తించును.



కూపన్లు పంపవలసిన చిరునామా
ఆంధ్రజ్యోతి కార్యాలయం, సర్వే నెంబరు 717 బి/5,
హర్ష టయోటా షోరూమ్ ప్రక్కన, తూకివాకం (విలేజ్ అండ్ పోస్టు),
రేణిగుంట మండలం, తిరుపతి జిల్లా. పిన్‌కోడ్: 517520 (ఆంధ్రప్రదేశ్)
అసిస్టెంట్ మేనేజర్ (సర్క్యులేషన్) - సెల్: 99854 11592
బ్రాంచి మేనేజర్ - సెల్: 99854 11573

సమాచార దృష్టి

రవాణా కార్మికులకు ప్రోత్సాహకం

పెరంబూర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రవాణా శాఖ కార్మికులు అచీవ్ ఇన్సెంటివ్ అందించనున్నట్టు రాష్ట్ర రవాణా శాఖ పేర్కొంది. రవాణా శాఖ కార్మికులకు 2024వ సంవత్సరానికి అచీవ్ ఇన్సెంటివ్ అందించాలని నిర్ణయించారు. ఈ మేరకు 200 రోజులు, ఆపైగా పనిచేస్తున్న కార్మికులకు రూ.625, 151 నుంచి 200 రోజులు పనిచేసిన కార్మికులకు రూ.95, 91 నుంచి 151 రోజులు పనిచేసిన కార్మికులకు రూ.85 ఇన్సెంటివ్ అందించనున్నట్లు రవాణా శాఖ తెలిపింది.

'ముఖ్యమంత్రి బీమా' పథక ప్రీమియంగా రూ.1,261 కోట్లు

పెరంబూర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి వైద్య బీమా పథకానికి 2025-26వ ఆర్థిక సంవత్సరానికి ప్రీమియంగా రూ.1,262.91 కోట్ల చెక్‌ను యునైటెడ్ ఇండియా బీమా సంస్థకు వైద్య మంత్రి సుబ్రమణ్యం అందజేశారు. దేశంలో వైద్య బీమా పథకంలో రాష్ట్రం మార్గదర్శకంగా ఉందని మంత్రి అన్నారు. 1.48 కోట్ల కుటుంబాలు లబ్ధి పొందేలా, ఒక్కో కుటుంబానికి ప్రీమియంగా రూ.849 చొప్పున చెల్లించామన్నారు. 2009లో పథకం ప్రారంభించనప్పటి నుంచి ఇప్పటివరకు 1.45 కోట్ల మంది రూ.14,991 కోట్ల మేర లబ్ధిపొందారన్నారు. ఈ పథకం 2,157 ఆస్పత్రుల్లో అందుబాటులో ఉండగా, మరో 2,053 వైద్య విధానంలో చికిత్సలు అందిస్తున్నామన్నారు. ఈ పథకంలో ప్రత్యేక శస్త్రచికిత్సలను 2 నుంచి 8కి పెంచినట్లు మంత్రి వివరించారు.

ఫ్రిజ్, వాషింగ్ మెషిన్ల విక్రయాల్లో సహకార శాఖ

పెరంబూర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సహకార శాఖ ఆధ్వర్యంలో సహకార సంఘాలు రేషన్ దుకాణాలు, సూపర్ మార్కెట్లు, మెడికల్ షాపులు, కూరగాయల దుకాణాలు, పెట్రోల్ బంక్, గ్యాస్ ఏజెన్సీలు నిర్వహిస్తున్నాయి. ప్రస్తుతం ఈ సంఘాలకు ఆదాయం పెంచాలని సహకార శాఖ నిర్ణయించింది. ఈ విషయమై ఆ శాఖ అధికారులు మాట్లాడుతూ... సహకార సంఘాలు విక్రయిస్తున్న సరకులు నాణ్యంగా ఉండడంతో పాటూ తక్కువ ధరకు అందిస్తుండడంతో ప్రజలనుంచి మంచి స్పందన వచ్చిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో పలు బహుళజాతి సంస్థలు ఎలక్ట్రానిక్ వస్తువులను ఉత్పత్తి చేస్తున్నాయన్నారు. ఎలక్ట్రానిక్ పరికరాలు టోకుగా కొనుగోలు చేసి, 5 శాతం అదనపు ధరకు విక్రయించినా, ప్రజలు తక్కువ ధరకు కొనుగోలు చేయవచ్చన్నారు. ఆ విధంగా ఫ్రిజ్, వాషింగ్ మెషిన్, మొబైల్ ఫోన్లు విక్రయించనున్నామని, అందుకోసం సామ్‌సంగ్, ఎల్జీ సహా పలు సంస్థలతో చర్చిస్తున్నట్టు అధికారులు పేర్కొన్నారు.

నిరుద్యోగ భృతికి దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ భృతి పొందేందుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చని కాంచీపురం జిల్లా కలెక్టర్ కలైసెల్వి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ భృతి పథకంలో 10వ తరగతి ఫెయిలైన వారికి రూ.200, 10వ తరగతి ఉత్తీర్ణులైన వారికి రూ.300, ప్లస్ టూ, డిప్లొమా కోర్సుకు రూ.400, డిగ్రీ ఉత్తీర్ణులైన వారికి నెలకు రూ.600 అందజేస్తోంది. కుటుంబ వార్షికాదాయం రూ.72,000 లోపు ఉండి, ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయాల్లో పేరు నమోదు చేసుకొని ఐదేళ్లు దాటిన వారు (దివ్యాంగులు రెండేళ్లు) ఈ భృతికి అర్హులు. అర్హులైన వారు ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయాలు, www.tnvelaivaaippu.g-v-in//empowerలో దరఖాస్తులు ఉచితంగా పొంది, విద్యార్హత, ఆదాయ, నివాస ధృవీకరణ, ఆధార్ కార్డు, రేషన్ కార్డు నకలు తదితరాలతో దరఖాస్తులు నేరుగా ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయంలో సమర్పించాల్సి ఉంటుంది.

మెట్రోలో మహిళా ఇంజనీర్లకు ఉద్యోగావకాశం

పెరంబూర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): చెన్నై మెట్రోరైల్ లిమిటెడ్ అసిస్టెంట్ సూపర్‌వైజర్ (సివిల్) పోస్టుకు ఇంజనీరింగ్ చేసిన మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ సంస్థలో 8 పోస్టులను మహిళలకు కేటాయించారు. రెండేళ్ల అనుభవం కలిగి 30 ఏళ్లలోపున్న మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంపికైన వారికి నెలకు రూ.62,000 వేతనం అందజేయనున్నారు. అర్హులైన వారు https://chennimetrorail.o-rg/jobnot-ifications/లో ఫిబ్రవరి 10వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవచ్చని సీఎంఆర్ఎల్ పేర్కొంది.

గిరి ప్రదక్షిణకు అనుకూల సమయం

పెరంబూర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై అరుణాచలేశ్వర ఆలయ గిరి ప్రదక్షిణకు అనుకూల సమయాన్ని ఆలయ నిర్వాహకులు ప్రకటించారు. ఈ ప్రకారం, ఈ నెల 13వ తేది ఉదయం 5.04 నుంచి 14వ తేది ఉదయం 3.57 గంటల వరకు గిరి ప్రదక్షిణ అనుకూల సమయం అని తెలిపారు.

నేటినుంచి దక్షిణాది జిల్లాలకు వర్షసూచన

పెరంబూర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): నైరుతి బంగాళాఖాతం, దానిని అనుకొని ఉన్న ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తన ద్రోణి ప్రభావంతో ఆదివారం నుంచి దక్షిణ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో భారీవర్షాలు కురిసే అవకాశమున్నట్టు వాతావరణ పరిశోధన కేంద్రం పేర్కొంది. ఆదివారం మైలాడుదురై, తంజావూరు, నాగపట్టినం, తిరువారూరు, పుదుకోట తదితర జిల్లాలు, 13న వేలూరు, రాణిపేట, తిరువణ్ణామలై జిల్లాలు, 14న తూత్తుకుడి, తిరునల్వేలి, కన్నియకుమారి తదితర జిల్లాల్లో ఒకటి, రెండు ప్రాంతాల్లో భారీవర్షాలు కురవనున్నాయి.చెన్నైలో ఆకాశం మేఘావృతమై, కొన్ని ప్రాంతాల్లో ఉరుములతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశముంది. పగటి ఉష్ణోగ్రత 30 డిగ్రీలు, రాత్రి ఉష్ణోగ్రత 23 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలిపింది.

పొల్లాచ్చి సామూహిక అత్యాచారాలపై సీఎం చెప్పిందే నిజం

స్పీకర్ అప్పావు

చెన్నై, జనవరి 11(ఆంధ్రజ్యోతి): పొల్లాచ్చిలో కాలేజీ విద్యార్థినులను నిర్బంధించి రోజుల తరబడి అత్యాచారాలకు పాల్పడిన సంఘటనలకు సంబంధించి శుక్రవారం శాసనసభలో ముఖ్యమంత్రి స్టాలిన్, ప్రధాన ప్రతిపక్షం నేత ఎడప్పాడి పళనిస్వామి చోటుచేసుకున్న తీవ్ర వివాదం ఎట్టకేలకు స్పీకర్ వెలువరించిన తీర్పుతో పరిష్కారమైంది. పొల్లాచ్చి అత్యాచార సంఘటన వెలుగులోకి వచ్చిన మరుసటి రోజూ అప్పటి అన్నాడీఎంకే ప్రభుత్వం ఎఫ్ఐఆర్ నమోదు చేసిందని పళనిస్వామి, రెండు వారాల తర్వాతే ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు స్టాలిన్ పరస్పరం ఆరోపణలకుదిగారు. దీనితోస్పీకర్ అప్పావు జోక్యం చేసుకుని ఇరువురు తమ వాదనలకు వత్తాసుగా రాతపూర్వకమైన ఆధారాలను తనకు సమర్పించాలని కోరారు. ఆ మేరకు ఈపీఎస్, స్టాలిన్ రాతపూర్వకమైన ఆధారాలను స్పీకర్‌కు సమర్పించారు.ఈ నేపథ్యంలో శనివారం ఉదయం స్పీకర్ అప్పావు శాసనసభలో పొల్లాచ్చి వ్యవహారంపై సీఎం స్టాలిన్ సమర్పించిన ఆధారాలే నిజమని తీర్పు ప్రకటించారు. పొల్లాచ్చి అత్యాచార సంఘటనలు జరిగిన 12రోజులతర్వాతే ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు స్టాలిన్ ఆధారాలను సమర్పించారని, వాటిని సంబంధిత అధికారులతో సంప్రతించి నిజమా కాదా అని నిర్ధారించుకున్న మీదట సభలో స్టాలిన్ చేసిన ప్రకటనే సత్యమని తెలిపారు.

అన్నాడీఎంకే ఆధ్వర్యంలో మహిళలకు పెప్పర్ స్ప్రే పంపిణీ

ఎడప్పాడి పళనిస్వామి


పెప్పర్ స్ప్రేలను పంపిణీ చేస్తున్న ఎడప్పాడి

ప్యారీస్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ఆధ్వర్యంలో మహిళల ఆత్మరక్షణ కోసం పెప్పర్ స్ప్రే పంపిణీ పథకానికి ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి శ్రీకారం చుట్టారు. స్థానిక రాయపేటలోని అన్నాడీఎంకే ప్రధాన కార్యాలయం ఎంజీఆర్ భవన్‌లో శనివారం మధ్యాహ్నం 3 గంటలకు అన్నాడీఎంకే జిల్లా కార్యదర్శుల సమావేశం ఈపీఎస్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశం రాష్ట్రంలో నెలకొన్న ప్రధాన సమస్యలు, డీఎంకే ప్రభుత్వ తీరును ఖండిస్తూ, పలు కీలక తీర్మానాలు ఆమోదించింది. సమావేశం అనంతరం ఈపీఎస్ మీడియాతో మాట్లాడుతూ... నీట్ వ్యవహారంలో ముఖ్యమంత్రి స్టాలిన్ రెండునాల్కల ధోరణిని ప్రదర్శిస్తున్నారని, కేంద్రప్రభుత్వానికే నీట్ రద్దు చేసే అధికారం ఉందని చెబుతూ, ప్రజలను మభ్యపెడుతున్నారని ఆరోపించారు. డీఎంకే ప్రభుత్వ హయాంలో అత్యాచార, లైంగిక వేధింపులకు గురవుతున్న మహిళలకు న్యాయం జరగడం లేదని, మహిళలు పలు స్వేచ్ఛగా తిరగలేకపోతున్నారన్నారు. అందుకే మహిళల ఆత్మరక్షణ కోసం తమ పార్టీ తరుఫున పెప్పర్ స్ప్రే పంపిణీని ప్రారంభించినట్లు చెప్పారు. ఎన్నికల సమయంలో డీఎంకే ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఈ మూడేళ్లలో 20 శాతం మాత్రమే అమలయ్యాయని, మిగిలిన వాటిని సీఎం స్టాలిన్ అటకెక్కించారన్నారు. కిరాణా సరకుల నుంచి భవన నిర్మాణ సామగ్రి ధరలు రెండింతలు పెరిగాయని, డొక్కు బస్సుల్లో మహిళలకు ఉచితంగా ప్రయాణం చేయడాన్ని అధికార పార్టీ నాయకులు గొప్పలు చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. దేశంలోనే రుణాలు పొందడంలో తమిళనాడు అగ్రస్థానంలో ఉందని, పరిస్థితి ఇలాగే కొనసాగితే రాష్ట్రప్రజలపై రుణభారం పెరుగుతుందని, ఈ అప్పు ఎలా తీరుస్తారని ముఖ్యమంత్రి స్టాలిన్‌ను ఈపీఎస్ సూటిగా ప్రశ్నించారు.

సాయిశ్రీ మెట్రిక్యులేషన్ పాఠశాలలో పొంగల్ వేడుకలు


పొంగల్ వేడుకల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు

తిరుత్తణి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి: తిరువళ్లూర్ జిల్లా పళ్లిపట్టు నగర్‌లోని సాయిశ్రీ మెట్రిక్యులేషన్ హయ్యర్ సెకండరీ స్కూల్ ప్రాంగణంలో శనివారం పొంగల్ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి స్కూల్ ప్రిన్సిపాల్ టీఎస్ఎం గురుమూర్తి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు పొంగళ్లు పెడుతూ 'పొంగలో..పొంగల్' అంటూ నినాదాలు చేశారు. సంప్రదాయ వస్త్రధారణలో పాల్గొన్న విద్యార్థులు పలురకాల క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. నృత్యాలు, పాటలతో విద్యార్థులు సందడి చేశారు. వేడుకల్లో భాగంగా పాఠశాల ప్రాంగణంలో రంగు రంగుల రంగవల్లికలను విద్యార్థులు తీర్చిదిద్దారు.

వాట్సప్ ద్వారా గిండి చిల్డ్రన్స్ పార్క్ టిక్కెట్లు

పెరంబూర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిండి చిల్డ్రన్ పార్క్‌లో పర్యటించేందుకు పిల్లలతో కలసి పెద్దలు అధికంగా వస్తుంటారు. వారాంతపు సెలవులు, విశేష రోజుల్లో సందర్శకుల రద్దీ అధికంగా ఉండడంతో, ప్రవేశ టిక్కెట్లు పొందేందుకు ప్రజలు అధిక సమయం కౌంటర్ల వద్ద వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో, సందర్శకులు కౌంటర్ల వద్ద వేచి ఉండకుండా వాట్సాప్ ద్వారా టిక్కెట్లు పొందే సౌకర్యం కల్పించారు. నెం.8667609954కు 'హాయ్' అని మెసేజ్ పంపిస్తే, సందర్శకులకు అవసరమైన వివరాలు తెలుసుకోవచ్చని అధికారులు తెలిపారు.

నేటినుంచి 'టి 20' టిక్కెట్ల విక్రయం

పెరంబూర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక చెపాక్ క్రికెట్ మైదానంలో ఈ నెల 25న భారత్ - ఇంగ్లండ్ మధ్య టి20 క్రికెట్ పోటీ జరుగనుంది. ఈ పోటీల టిక్కెట్ల విక్రయాలు ఆదివారం ఉదయం 11 గంటలకు ప్రారంభం కానున్నాయి. టిక్కెట్టు ధరలు స్టాండ్‌లను బట్టి రూ.1,500 నుంచి రూ.12,000 వరకు నిర్ణయించారు. టిక్కెట్లు District by Zomato అనే మొబైల్ యాప్, http://district.in ద్వారా పొందవచ్చు.

పొంగల్ బహుమతుల పంపిణీ

పెరంబూర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఉపఎన్నిక జరగనున్న ఈరోడ్ తూర్పు నియోజకవర్గంలో పొంగల్ బహుమతుల పంపిణీ శనివారం ప్రారంభమైంది. పొంగల్ సందర్భంగా బియ్యం కార్డుదారులకు కిలో పచ్చి బియ్యం, కిలో చక్కెర, చెరకు గడ, ధోవతి, చీర అందించనున్నట్లు రాష్ట్రప్రభుత్వం ప్రకటించింది. ఇందుకోసం రేషన్ కార్డుదారులకు టోకెన్ల పంపిణీ ఈనెల 4వ తేది నుంచి ప్రారంభమైంది. మరుసటి రోజైన 5వ తేది ఈరోడ్ తూర్పు ఉపఎన్నిక నోటిఫికేషన్ విడుదల కావడంతో ఆ నియోజకవర్గంలో కోడ్ అమల్లోకి వచ్చింది. ఈ నేపథ్యంలో, 9వ తేది పొంగల్ బహుమతుల పంపిణీని ముఖ్యమంత్రి స్టాలిన్ లాంఛనంగా ప్రారంభించారు. టోకెన్లు పొందిన ఈరోడ్ తూర్పు నియోజకవర్గ కార్డుదారులకు పొంగల్ బహుమతి పొందేందుకు రేషన్ దుకాణాలకు వెళ్లగా, ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో పంపిణీ లేదని దుకాణాల ముందు పోస్టర్లు ఉంచారు. ఈ నేపథ్యంలో, అధికారుల విజ్ఞప్తి మేరకు పొంగల్ బహుమతి పంపిణీకి ఎన్నికల సంఘం అనుమతించింది. బహుమతుల పంపిణీ సమయంలో దుకాణాల వద్ద ఏ రాజకీయ పార్టీ ప్రచారం చేపట్టరాదు. ఈసీ నిబంధనతో శనివారం నుంచి బహుమతుల పంపిణీ ప్రారంభమైంది.

మదురై లాడ్జీలో చెన్నై రౌడీ అరెస్ట్

పెరంబూర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): హత్యలు, పలు నేరాల కేసుల్లో నిందితుడిగా ఉన్న చెన్నైకి చెందిన రౌడీని మదురైలో పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక చూలైమేడుకు చెందిన రౌడీ కనగు అలియాస్ కనకరాజ్‌పై ఎన్నూర్, పూందమల్లి పోలీస్ స్టేషన్లలో మూడు హత్యలు, పలు నేరాలకు సంబంధించిన కేసులున్నాయి. అతని కోసం పోలీసులు గాలించిన సమయంలో హఠాత్తుగా అదృశ్యమయ్యాడు. మదురై ఆరపాళయంలోని ఓ హోటల్‌లో కనకరాజ్ బస చేస్తున్నట్లు అందిన సమాచారంతో ప్రత్యేక విభాగం పోలీసులు అక్కడకు వెళ్లారు. శనివారం ఉదయం హోటల్ గదిలో ప్రవేశించిన పోలీసులు తుపాకులు ఎక్కుపెట్టి కనకరాజ్‌ను అదుపులోకి తీసుకున్నారు. కాగా, తన భర్తను పోలీస్ ఎన్‌కౌంటర్ చేస్తారని కనకరాజ్ భార్య మేఘల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఈపీఎస్ బంధువు నివాసంలో 5వ రోజూ కొనసాగిన ఐటీ దాడులు


ఈరోడ్ రామలింగం నివాసగృహం ప్రధాన ద్వారం వద్ద కాపలా కాస్తున్న సాయుధ పోలీసు

చెన్నై, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) బంధువు, ప్రముఖ భవన నిర్మాణాల సంస్థ ఎన్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత ఎన్.రామలింగం ఇళ్లు, కార్యాలయాల్లో ఐదో రోజూ ఐటీ తనిఖీలు కొనసాగాయి. ఈరోడ్ పూత్తురైరోడ్డు చెట్టిపాళయం స్టేట్ బ్యాంక్ నగర్‌లోని రామలింగం నివాసం, కార్యాలయాలు సహా మొత్తం 26 ప్రాంతాల్లో ఈ నెల 7న ఆదాయపన్నుల శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. ఎన్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ పెద్దనోట్ల రద్దు సమయంలో అక్రమ నగదు బట్వాడాలకు పాల్పడిందని, కొన్నేళ్లుగా భారీ స్థాయిలో పన్నుల ఎగవేతకు పాల్పడినట్లు ఆరోపణలు రావటంతో ఈ దాడులు నిర్వహించారు. చెన్నై, కోయంబత్తూరు, ఈరోడ్ నగరాల్లో ఈ దాడులు కొనసాగాయి. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం ఆవల్ పూత్తురై వద్దనున్న రామలింగం నివాసగృహం, అమ్మాపేటలో ఉన్న కర్రపెండలం పిండి మిల్లు, కార్యాలయంలోనూ దాడులు కొనసాగాయి. ఈ ప్రాంతాల వద్ద సాయుధదళం కానిస్టేబుళ్లు కాపలా కాశారు.

15నుంచి 16 బోగీలతో 'తిరునల్వేలి వందే భారత్' రైలు

పెరంబూర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): చెన్నై ఎగ్మూర్-తిరునల్వేలి మధ్య నడుస్తున్న 'వందే భారత్' రైలు ఈనెల 15వ తేది నుంచి 16 బోగీలతో నడపనున్నారు. దక్షణాది జిల్లాలకు పగటి పూజ రెండుమార్గాల్లో రైళ్లు నడపాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. వారి విజ్ఞప్తి మేరకు చెన్నై ఎగ్మూర్ - తిరునల్వేలి మధ్య వందే భారత్ రైలు సేవలను దక్షిణ రైల్వే ప్రారంభించింది. తిరునల్వేలి నుంచి ఉదయం 6.05 గంటలకు బయల్దేరే రైలు, 7.50కి మదురై, 9.45 గంటలకు తిరుచ్చి చేరుకొని, అక్కడి నుంచి మధ్యాహ్నం 1.55 గంటలకు చెన్నై ఎగ్మూర్ చేరుకుంటుంది. మరో మార్గంలో చెన్నై ఎగ్మూర్ నుంచి మధ్యాహ్నం 2.45 గంటలకు బయల్దేరి సాయంత్రం 6.35 గంటలకు తిరుచ్చి, రాత్రి 8.20 గంటలు, తిరునల్వేలి 10.30 గంటలకు చేరుకుంటుంది. ఏడు ఏసీ ఛైర్ కార్లు, ఎగ్జిక్యూటివ్ అని మొత్తం 8 బోగీలతో 650 సీట్లతో నడుస్తున్న వందే భారత్ రైలు ఛార్జీలు అధికంగా ఉన్నా, ప్రయాణికుల సంఖ్య తగ్గలేదు. ఈ నేపథ్యంలో, ఈ రైలును అదనపు బోగీలతో నడపాలనే ప్రజల విజ్ఞప్తి మేరకు, ఈనెల 11వ తేది నుంచి 16 బోగీలతో నడపనున్నట్లు దక్షిణ రైల్వే ఇదివరకే విడుదల చేసింది. కానీ, తాజాగా ఈ రైలు 15వ తేది నుంచి 16 బోగీలతో నడుస్తుందని, ఈ ప్రకారం ప్రయాణికులు రిజర్వేషన్ చేసుకోవచ్చని దక్షిణ రైల్వే తాజాగా ప్రకటన విడుదల చేసింది.

పోలీస్‌స్టేషన్‌కే కన్నం

అడ్డుకున్న పోలీసుపై దాడి

పెరంబూర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పోలీస్ స్టేషన్‌కే కన్నం వేసిన ఘరానా దొంగలను పోలీసులు అరెస్ట్ చేశారు. తేని జిల్లా ఈశ్వర్‌నగర్‌లో మాదకద్రవ్యాల నిరోధక విభాగం పోలీస్‌స్టేషన్ ఉంది. చట్టవిరుద్ధంగా విక్రయిస్తున్న, తరలిస్తున్న మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకుని ఈ స్టేషన్‌లో భద్రపరుస్తుంటారు. ఘటన జరిగిన రోజున స్టేషన్ మేడ నుంచి గుర్తుతెలియని వ్యక్తులు లోపలికి ప్రవేశించారు. రాత్రి వేళ స్టేషన్‌లో అలికిడి విన్న చుట్టుపక్కల వారు వెంటనే గస్తీ తిరుగుతున్న పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు స్టేషన్‌కు రావడాన్ని గమనించిన దొంగలు అక్కడి నుంచి తప్పించుకొనేందుకు యత్నించారు. వారిని వెంబడించి పట్టుకొనేందుకు యత్నించిన పోలీసుపై దొంగలు దాడిచేశారు. ఆ సమయంలో మరికొందరు పోలీసులు వారిని చుట్టుముట్టి అరెస్ట్ చేశారు. అరెస్టయిన ఇద్దరిని పెరియకుళం డీఎస్పీ విచారిస్తున్నారు. స్టేషన్‌లో మాదకద్రవ్యాలు చోరీ చేసేందుకు వచ్చారా? అన్న కోణంలో విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బాలికపై లైంగిక వేధింపుల ఏఎస్ఐ అరెస్ట్

పెరంబూర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మదురై జిల్లాలో బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన ప్రత్యేక సబ్ ఇన్‌స్పెక్టర్ పోక్సో చట్టం కింద కటకటాలపాలయ్యాడు. కార్తీక దీపోత్సవం రోజున తిరుప్పరగుండ్రంలో గిరి ప్రదక్షిణ చేస్తున్న 14 ఏళ్ల బాలిక టాయిలెట్‌కు వెళ్లింది. ఆ సమయంలో భద్రతా విధుల్లో ఉన్న ప్రత్యేక సబ్ ఇన్‌స్పెక్టర్ జయపాండ్యన్, బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు సమాచారం. బాధిత బాలిక తల్లిదండ్రులు పిల్లల భద్రత అధికారులను ఆశ్రయించడంతో, వారు మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై విచారణ చేపట్టిన పోలీసులు, పోక్సో చట్టంపై కేసు నమోదుచేసి శనివారం ఏఎస్ఐను అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. కాగా, నేరారోపణలు ఎదుర్కొంటున్న ఏఎస్ఐను సస్పెండ్ చేస్తూ జిల్లా పోలీసు శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

తైపూసం సందర్భంగా కోవై-పళని-దిండుగల్ మధ్య ప్రత్యేక రైలు

పెరంబూర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పళని దండాయుధపాణి ఆలయంలో జరిగే తైపూసం వేడుకల్లో పాల్గొనే భక్తుల సౌకర్యార్థం కోయంబత్తూర్ - పళని - దిండుగల్ మీదుగా అన్ రిజర్వుడు ప్రత్యేక రైలు నడపనున్నారు. ఈ ప్రకారం, నెం.06106 కోయంబత్తూర్ దిండుగల్ ప్రత్యేక రైలు వారంలో ఆరు రోజులు (ఆదివారం మినహా) కోయంబత్తూర్‌లో ఉదయం 9.35 గంటలకు బయల్దేరి మధ్యాహ్నం 1.10 గంటలకు దిండుగల్ చేరుకుంటుంది. మరో మార్గంలో నెం.06107 దిండుగల్-కోయంబత్తూర్ ప్రత్యేక అన్ రిజర్వుడ్ రైలు ఆయా రోజుల్లో దిండుగల్ నుంచి మధ్యాహ్నం 2 గంటలకు బయల్దేరి సాయంత్రం 5.50 గంటలకు కోయంబత్తూర్ చేరుకుంటుంది. ఫిబ్రవరి 4 నుంచి 14వ తేది వరకు నడపనున్న ఈ రైళ్లు పోతనూరు, కినత్తకడవు, పొల్లాచ్చి, ఉడుమలైపేట, పళని, ఒట్టాన్‌సత్రం తదితర స్టేషన్లలో ఆగుతాయని దక్షిణ రైల్వే తెలిపింది.

కుటుంబ కలహాలకు ఇద్దరు చిన్నారుల బలి

పిల్లలతో కలసి బావిలో దూకిన తల్లి ● తల్లిని కాపాడగలిగిన గ్రామస్తులు ● అప్పటికే పిల్లలిద్దరూ మృత్యువాత


చిన్న పిల్లల మృతదేహాలు - చికిత్స పొందుతున్న తల్లి

నగరి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాలకు ఇద్దరు చిన్నారుల జీవితాలు బలైపోయాయి. ఆవేశంలో పిల్లల కన్నతల్లి తీసుకున్న నిర్ణయం రెండు కుటుంబాల్లో శాశ్వత విషాదాన్ని నింపింది. చిత్తూరు జిల్లా పోలీసుల కథనం మేరకు... నగరి మున్సిపాలిటీ పరిధిలోని భీమానగర్‌కు చెందిన దేవి (33)కి, చెన్నైలోని వెస్ట్ మాంబళానికి చెందిన ధనంజయులుతో కొన్నేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఐశ్వర్య (10), అక్షర (3) అనే ఇద్దరు అమ్మాయిలు పుట్టారు.కుటుంబ కలహాల కారణంగా గురువారం దేవి నగరిలోని పుట్టింటికి వచ్చేసింది. శుక్రవారం ఏకాంబరకుప్పం సమీపంలో వున్న సాశ్వపట్టెడలోని పెదనాన్న ఇంటికి వెళ్లి వస్తానని దేవి ఇద్దరు పిల్లలను తీసుకువెళ్లింది. అయితే ఆమె తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు సాశ్వపట్టెడలోని బంధువులను విచారించారు.జాడ తెలియకపోవడంతో పోలీసులకు శనివారం ఉదయం ఫిర్యాదు చేశారు.సాయంత్రం సాశ్వపట్టెడ సమీపంలోని పొలాల నుంచి ఆవులు తోలుకు వస్తున్న వ్యక్తులకు అక్కడున్న బావినుంచి శబ్దాలు వినిపించాయి.బావి దగ్గరకు వెళ్లి చూడగా తాడు పట్టుకొని వేలాడుతున్న దేవి కన్పించింది.వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. అందరూ కలసి ఆమెను పైకిలాగి ఆస్పత్రికి తరలించారు. పిల్లలకోసం గాలించి రాత్రి ఇద్దరు చిన్నారుల మృతదేహాలను బావి నుంచి బయటకు తీశారు.నగరి సీఐ మహేశ్వర్ నేతృత్వంలో పోలీసులు విచారణ చేపట్టారు.

మహిళలకు రక్షణ లేదు

● నిందితులను కాపాడే ప్రయత్నంలో డీఎంకే

● అన్నాడీఎంకే మాజీ మంత్రి వలర్మతి ధ్వజం


ధర్నాలో ప్రసంగిస్తున్న మాజీమంత్రి వలర్మతి

ప్యారీస్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): డీఎంకే పాలనలో మహిళలకు రక్షణ కరువైందని, మూడేళ్ల చిన్నారుల నుంచి 60ఏళ్ల వృద్ధురాళ్ల వరకు లైంగిక వేధింపులకు గురవుతున్నారని అన్నాడీఎంకే మహిళా విభాగ రాష్ట్ర కార్యదర్శి, మాజీ మంత్రి వలర్మతి మండిపడ్డారు. అన్నా వర్శిటీ విద్యార్థినిపై అత్యాచార ఘటనను ఖండిస్తూ అసలు నేరస్థులను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం అన్నాడీఎంకే మహిళా విభాగం ఆధ్వర్యంలో సైదాపేటలో నిర్వహించిన మహా ధర్నాలో వందలాదిమంది కార్యకర్తలు పాల్గొని రాష్ట్రప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. మరికొంత మంది కన్నగి వేషధారణలో ప్లకార్డులు చేత పట్టుకుని డీఎంకే నేతల చర్యలను దుయ్యబట్టారు. ఈ ధర్నాలో వలర్మతి మాట్లాడుతూ.. మూడున్నరేళ్లుగా డీఎంకే ప్రభుత్వంలో ప్రతిరోజు హత్యలు, హత్యాయత్నాలు, దోపిడీలు, దొంగతనాలు, మహిళలపై వేధింపులు వెలుగుచూస్తున్నాయని, అయిన వాటిని కట్టడి చేసేందుకు పోలీసు శాఖ ఎలాంటి చర్యలు చేపట్టకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. అనంతరం మాజీమంత్రి గోకుల ఇందిర మాట్లాడుతూ.. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో అన్నావర్శిటీ ఘటనపై వాస్తవాలు వెల్లడించాలని నిలదీసిన అన్నాడీఎంకే సభ్యులను గెంటివేయించడం ప్రజాస్వామ్య విరుద్ధమన్నారు. అత్యాచారం కేసులో పట్టుబడ్డ డీఎంకే నాయకుడు జ్ఞానశేఖరన్‌ను కాపాడేందుకు మంత్రులు సైతం పావులు కదుపుతున్నారని విమర్శించారు. అన్నా డీఎంకే లేవనెత్తిన ఎవరా సార్? అనే నినాదానికి సమాధానం చెప్పలేక డీఎంకే నేతలు తాజాగా ఈయనే ఆ సార్! అని తప్పుడు ప్రచారం చేపట్టారని మరో మాజీ మంత్రి సరోజ పేర్కొన్నారు. ఈ ధర్నాలో మాజీ ఎమ్మెల్యేలు, మహిళా విభాగం నాయకురాళ్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజలను నమ్మించి మోసం చేశారు

● నీట్ రద్దు హామీ చక్కటి ఉదాహరణ

● టీవీకే అధినేత విజయ్ ధ్వజం



చెన్నై, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రజలను నమ్మించి మోసం చేయడమే పాలకుల ప్రధాన లక్ష్యంగా కనబడుతోందని, అందుకు నీట్ రద్దు హామీ ప్రకటన చక్కటి ఉదాహరణ అని తమిళగ వెట్రి కళగం అధ్యక్షుడు, నటుడు విజయ్ డీఎంకే ప్రభుత్వంపై తన ఎక్స్ పేజీలో ధ్వజమెత్తారు. ప్రస్తుత పాలకులను చూస్తుంటే.. ఇంకెంతకాలం జనాన్ని ఏమారుస్తారోననే ఎంజీఆర్ సినిమా పాటే గుర్తుకు వస్తోందన్నారు. ఎన్నికల సమయంలో అమలుకు సాధ్యం కాని హామీల వర్షం కురిపించి, నమ్మించి మోసం చేయాలని, ఎన్నికల్లో గెలిచిన తర్వాత కూడా అదేపనిగా ప్రజలను మోసగిస్తూనే ఉండాలి అనే ప్రధాన లక్ష్యంతోనే ప్రస్తుత పాలకులు వ్యవర్తిస్తున్నారని విమర్శించారు. ఈ ఆరోపణకు తాను ఎన్నో ఆధారాలను చూపవచ్చని, మచ్చుకు నీట్ రద్దు ఒకటన్నారు. 2012 ఎన్నికల ప్రచార సమయంలో తాము అధికారంలోకి రాగానే నీట్‌ను రద్దు చేస్తామని, ఆ పరీక్షలను ఎలా రద్దు చేయాలన్న రహస్యం తమకు మాత్రమే తెలుసునని ప్రచారం చేసి, తమిళ ప్రజానీకాన్ని నమ్మించారన్నారు. తీరా అధికారంలోకి వచ్చాక దాన్ని రద్దు చేసే అధికారం కేంద్రప్రభుత్వానికే ఉందని, రాష్ట్రానికి లేదని చెప్పడం ఓట్లు వేసి గెలిపించిన ప్రజలను మోసగించడమే కదా అని విజయ్ పశ్నించారు. రానున్న ఎన్నికల్లోనూ ఆచరణకు సాధ్యంకాని అసత్య హామీలను ప్రకటించి తమిళ ప్రజల మోసగించవచ్చని కలలు కంటున్న పాలకుల కోరికలు ఎట్టి పరిస్థితులలోనే నెరవేరే అవకాశం లేదని విజయ్ పేర్కొన్నారు.

పాముల సంచారంతో విద్యార్థుల బెంబేలు


ప్రహరీ లేని హాస్టల్

తిరుత్తణి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): హాస్టల్ పరిసరాల్లో పాముల సంచారం అధికంగా ఉండడంతో విద్యార్థులు హడలిపోతున్నారు. తిరుత్తణి సమీపంలోని కేజీకండిగై ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న సుమారు 50 మంది విద్యార్థులు, అక్కడి బీసీ సంక్షేమ హాస్టల్‌లో బస చేస్తున్నారు. ఈ హాస్టల్ సమీపంలో పొదలున్నాయి. హాస్టల్ భవనానికి ప్రహరీ లేకపోవడంతో తరచూ పాములు వస్తుంటాయని విద్యార్థులు వాపోతున్నారు. అలాగే, పాఠశాల ఎదురుగా ఉన్న రోడ్డుపై స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో వాహనాలు వేగంగా వెళుతుంటాయని, ఆ సమయంలో విద్యార్థులు ప్రమాదకర స్థితిలో రోడ్డు దాటి పాఠశాలకు రావాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ప్రహరీగోడ నిర్మించడంతో పాటు రోడ్డుపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

మాదక ద్రవ్యాలతో మహిళ సహా నలుగురి అరెస్ట్


పోలీసుల అదుపులో నిందితులు

ప్యారీస్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): తిరుచ్చిలో మాదకద్రవ్యాన్ని విక్రయిస్తున్న మహిళ సహా నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.లక్ష విలువైన ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. తిరుచ్చి వైయలూర్ రోడ్డులో మాదకద్రవ్యాలు విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వురయూర్ ఇన్‌స్పెక్టర్ రామానుజం సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని మాదకద్రవ్యాలు విక్రయిస్తున్న ముఠాను చుట్టుముట్టి నలుగురిని అరెస్ట్ చేశారు. విచారణలో వారు తిరుచ్చి కెనరా బ్యాంక్ కాలనీ శ్రీనివాసనగర్‌కు చెందిన పూజిత్, ఆల్విన్, నకుల్ దేవ్, మహిళ అని తెలిసింది. ఈ నలుగురికి అంతర్జాతీయ మాదకద్రవ్యాల స్మగ్లింగ్ ముఠాతో సంబంధాలున్నాయని దర్యాప్తులో తేలింది. ఈ ముఠాకు కోయంబత్తూర్‌కు చెందిన ఓ వ్యక్తి ఏజెంట్‌గా వ్యవహరిస్తున్నాడని, ప్రస్తుతం స్వాధీనం చేసుకున్న మాదకద్రవ్యం ఆఫ్ఘనిస్తాన్ నుంచి నౌకల ద్వారా దిగుమతి చేసుకుని, పలు ప్రాంతాలకు సరఫరా చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


'ఆంధ్ర కళాస్రవంతి' ఆధ్వర్యంలో శనివారం 2025 క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సంస్థ అధ్యక్షుడు జేఎం నాయుడు, కార్యదర్శి జె.శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ పి.సరస్వతి, కమిటీ సభ్యులు ఓ.మనోహరన్, ఇ.బాలాజీ, జె.రాధిక తదితరులు

తమిళ చిత్రజ్యోతి

ఎన్నో కష్టాలు అనుభవించా

● వడివేలు



ఉదయనిధి హీరోగా నటించిన 'మామన్నన్' తరహాలో తాను ఎన్నో కష్టాలు అనుభవించానని అందుకే హాస్యనటుడిగా స్థిరపడ్డానని ప్రముఖ కమెడియన్, 'వైగై పుయల్' వడివేలు అన్నారు.మదురై బీబీకుళంలోని ఆదాయపన్ను శాఖ ప్రాంతీయ కార్యాలయంలో జరిగిన సంక్రాంతి వేడుకలకు వడివేలు విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 'మామయ్య నాకు నారాయణన్ అని పెట్టారు. నా ఆరోగ్యం క్షీణించడంతో మా అమ్మ నాకు వడివేలుగా పేరుమార్చారు.ఇప్పుడు ఇంత గొప్ప ప్రదేశానికి వచ్చిందుకు సంతోషంగా ఉంది.కానీ 'మామన్నన్'లా ఎన్నో కష్టాలు అనుభవించిన వాడిని అందుకు కమెడియన్‌గా మారాను. సంక్రాంతి తర్వాత నా తుదుపరి చిత్రానికి సిద్ధమవుతా. సుందర్ సి దర్శకత్వంలో 'గ్యాంగర్స్', ఫహద్ ఫాజిల్‌తో 'మారిసన్', ప్రభుదేవాతో కలిసి మరో చిత్రంలో నటిస్తున్నా. మంచి సందేశాత్మక, చిన్నపిల్లలను ఆనందపరిచే వినోదాత్మక చిత్రాలను ఎంచుకుని నటిస్తున్నాను' అని వెల్లడించారు.

'విక్రమ్-63' కోసం ఇద్దరు భామల మధ్య పోటీ



ప్రియాంకా మోహన్

చియాన్ విక్రమ్ తన 63 చిత్రాన్ని మడోన్ అశ్విన్ దర్శకత్వంలో చేయనున్నారు. యోగిబాబుతో 'మండేలా', శివకార్తికేయన్‌తో 'మావీరన్' వంటి హిట్ చిత్రాలను రూపొందించిన అశ్విన్... తన తదుపరి ప్రాజెక్టులో విక్రమ్‌ను డైరెక్ట్ చేసేందుకు సిద్ధమవుతున్నారు. శాంతి టాకీస్ బ్యానరుపై తెరకెక్కే ఈ చిత్రం కోసం నటీనటులతో పాటు ఇతర సాంకేతిక నిపుణుల ఎంపిక ముమ్మరంగా సాగుతోంది. ఇందులోభాగంగా హీరోయిన్ ఎంపికపై దర్శక నిర్మాతలు ప్రత్యేక దృష్టిసారించారు. త్వరలోనే సెట్స్‌పైకి వెళ్ళనున్న 'చియాన్ 63'లో తొలుత సాయిపల్లవిని హీరోయిన్‌గా ఎంపిక చేసినట్టు వార్తలు వచ్చాయి. కానీ, సాయిపల్లవి పలు చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉండటం వల్ల క్యాల్షీట్లను సర్దుబాటు చేయలేకపోయారు. దీంతో ప్రియాంకా మోహన్ లేదా శ్రీనిధి శెట్టితో సంప్రదింపులు జరుపుతున్నట్టు కోలీవుడ్ వర్గాల టాక్. ఈ ఇద్దరిలో 'కోబ్రా' మూవీలో విక్రమ్ సరసన శ్రీనిధి శెట్టి నటించారు. అయినప్పటికీ మరో అవకాశం దక్కించుకునేందుకు ఆమె ముమ్మరంగానే ప్రయత్నిస్తున్నట్టు సమాచారం.



శ్రీనిధి శెట్టి

యోగిబాబు సారథ్యంలో 'కుళందైగల్ మున్నేట్ర కళగం'



'కుళందైగల్ మున్నేట్ర కళగం'లో ఓ దృశ్యం

ప్రముఖ హాస్య నటుడు, హీరో యోగిబాబు ప్రధాన పాత్రలో'కుళందైగల్ మున్నేట్ర కళగం' (కేఎంకే) పేరుతో చిత్రం తెరకెక్కగా ఈ నెల 24న విడుదల చేస్తున్నట్టు నిర్మాతలు అధికారికంగా ప్రకటించారు. 'శకుని' ఫేం శంకర్ దయాళ్ దర్శకుడు. అయితే ఈ సినిమా విడుదలకాకముందే భౌతికంగా దూరమయ్యారు. గత నెలలో గుండెపోటుతో శంకర్ దయాళ్ మృతి చెందారు. ఇదిలావుండగా ఈ మూవీ ఫస్టులుక్‌తో పాటు టీజర్‌ను ఇప్పటికే విడుదల చేయగా అనూహ్యమైన స్పందన వచ్చింది.యోగిబాబుతో పాటు సెంథిల్.అహల్య తదితరులు నటించారు.ఈ సినిమా ప్రమోషన్ కార్యక్రమాల్లో భాగంగా, లిరికల్ సాంగ్‌లను కూడా విడుదల చేశారు. ఈ నేపథ్యంలో ఈనెల 24వ తేదీన సినిమాను థియేటర్లలో విడుదల చేస్తున్నట్టు నిర్మాత అరుణ్‌కుమార్ సంబంధం తెలిపారు. మీనాక్షి అమ్మాల్ మూవీస్ పతాకంపై నిర్మించిన చిత్రానికి కెమెరా లక్ష్మణ్, స్టంట్స్ సుధీష్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ జాన్ రాబిన్స్, సంగీతం ఎస్‌పీఎస్.



సన్మాన గ్రహీతలతో గ్రేటర్ చెన్నై పోలీస్ కమిషనర్ అరుణ్

ఇకపై రౌడీల తాటతీస్తాం

● గ్రేటర్ చెన్నై పోలీస్ కమిషనర్ అరుణ్
● 1,302 మంది గూండా చట్టం కింద అరెస్ట్

ప్యారీస్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): రౌడీల అఘాయిత్యాలను కట్టడి చేయడమే తన ప్రధాన లక్ష్యమని, చెన్నైలో 1,302 మందిని గూండా చట్టం కింద అరెస్టు చేసి జైలుకి తరలించినట్లు గ్రేటర్ చెన్నై పోలీసు కమిషనర్ అరుణ్ పేర్కొన్నారు. నగరంలో దోపిడీలు, దొంగతనాలకు పాల్పడిన నిందితులను కాలయాపన చేయకుండా అరెస్టు చేసిన పోలీసులను స్థానిక వేపేరిలోని పోలీసు కమిషనర్ కార్యాలయానికి ఆహ్వానించి కమిషనర్ వారిని శుక్రవారం అభినందించారు.ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... రౌడీయిజం, దౌర్జన్యం, కట్టపంచాయతీ తదితర చట్టవిరుద్ధ కార్యకలాపాలను పూర్తి స్థాయిలో అరికట్టేందుకు పోలీసుశాఖ చర్యలు చేపట్టిందన్నారు. ప్రధానంగా రౌడీలను ఉక్కుపాదంతో అణచివేసేందుకు ప్రత్యేక శాఖను ప్రారంభించామని, దీంతో హత్యాయత్నాలు చాలా వరకు తగ్గాయన్నారు.

కోవలంలో హెలికాప్టర్ విహారయాత్ర ప్రారంభం



పెరంబూర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఈసీఆర్ రోడ్డు సమీపంలోని కోవలం బీచ్‌లో హెలికాప్టర్ విహారయాత్ర సేవలు పునఃప్రారంభమయ్యాయి. ఓ ప్రైవేటు సంస్థ గత ఏడాది ఈ విహారయాత్ర సేవలు ప్రారంభించగా, అనివార్య కారణాలతో నిలిపివేశారు. ఈ నేపథ్యంలో, శుక్రవారం మళ్లీ ఈ సేవలు ప్రారంభమయ్యాయి. శని, ఆదివారాలు, ఈ నెల 17 నుంచి 19వ తేది వరకు ఈ యాత్ర అందుబాటులో ఉంటుంది. ఇందులో ప్రయాణించేందుకు ఒకరికి రూ.6,000 చార్జీగా నిర్ణయించారు. భూమి నుంచి 1,000 అడుగుల ఎత్తున 5 నుంచి 7 నిమిషాలు బకింగ్‌హామ్ కాలువ, పాత మహాబలిపురం రోడ్డు సమీపంలోని ఎత్తైన భవనాలు, ప్రకృతి అందాలు చూడవచ్చు. పైలెట్‌తో పాటు ఆరుగురు ఈ హెలికాప్టర్‌లో ప్రయాణించవచ్చు. పర్యాటకుల శరీర బరువు పరీక్షలు, ఆధార్ నెంబరు చూసిన తర్వాతే అనుమతిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఏర్కాడులో అధికమైన చలిగాలులు



ఏర్కాడు అంతటా అలుముకున్న దట్టమైన మంచు

చెన్నై, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లాలో పేదల ఊటీగా పేరుగడించిన పర్యాటక ప్రాంతంలో కనీవినీ ఎరుగని రీతిలో విపరీతంగా చలిగాలులు వీస్తున్నాయి. ఈశాన్య రుతుపవనాల ప్రభావిత వర్షాల కారణంగా ఆ ప్రాంతంలోని జలాశయాలు, చెరువులు, వాగులు, వంకలు జలకళను సంతరించుకున్నారు. డిసెంబర్ రెండో వారం నుంచి వేకువజామున మంచు కురుస్తోంది. ఏర్కాడు అంతటా గత పదేళ్లలో లేనంత చలిగాలులు వీస్తున్నాయి. దీనికి మంచు తోడవడంతో ఉదయం 11 గంటల వరకూ స్థానికులు ఇల్లు విడిచి బయటకు రాలేకున్నారు. విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులు స్వెటర్‌లు ధరించి వెళ్తున్నారు. శనివారం ఉదయం కూడా ఏర్కాడు అంతటా మంచు అలుముకుంది. చలికి వణకిన జనం అక్కడక్కడా చలి కాసుకున్నారు. ఇక కనుమ దారుల్లో వెళ్లే వాహనాలన్నీ మంచు కురుస్తుండటంతో హెడ్‌లైట్లు వేసుకుని రాకపోకలు సాగించాయి.

ప్రదర్శనను ప్రారంభిస్తున్న సినీ ప్రముఖులు



జోయలుక్కాస్‌లో వజ్రాభరణాల ప్రదర్శన

చెన్నై, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పొంగల్ పండుగను పురస్కరించుకుని స్థానిక టి.నగర్ ఉస్మాన్‌రోడ్డులో ఉన్న ప్రశాంత్ గోల్డ్‌టవర్‌లో శనివారం ప్రముఖ సినీ నటులు ప్రశాంత్, త్యాగరాజన్, అతుల్యా రవి, వెట్రి, సుభిక్ష, జోయలుక్కాస్ డీజీఎం రాజేష్ కృష్ణన్ తదితరులు ప్రత్యేక వజ్రాభరణాల ప్రదర్శనను ప్రారంభించారు. ఈ ప్రదర్శన ఈనెల 26వ తేదీ వరకు కొనసాగనుంది. అన్ని వర్గాలకు అనుగుణంగా, ఆధునికతను జోడించి రూపొందించిన వజ్రాభరణాలు ఈ ప్రదర్శనలో ఉన్నట్లు సంస్థ చైర్మన్ జోయ్ అలుక్కాస్ పేర్కొన్నారు.

కేసరి మహోన్నత పాఠశాలలో వేడుకగా సంక్రాంతి



హరిదాసు వేషంలో విద్యార్థి

చెన్నై, జనవరి 11 (ఆంధ్ర జ్యోతి): స్థానిక టినగర్‌లోని కేసరి మహోన్నత పాఠశాలలో శనివారం సంక్రాంతి వేడుకలు ఘనంగా జరిగాయి. పలు సంప్రదాయ, సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు రకరకాల రంగవల్లికలను వేసి విద్యార్థులు తమ సృజనాత్మకతను ప్రదర్శించడానికి పాఠశాల చక్కటి వేదికగా నిలిచింది. విద్యార్థులకు కొన్ని విభాగాల్లో రంగవల్లికల పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన కీర్తివాసన్, కె.కృష్ణారావు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమానికి నేతృత్వం వహించిన పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగుల గోపాలయ్య విద్యార్థులకు సంక్రాంతి ప్రాముఖ్యతను విశదీకరించారు. ఈ కార్యక్రమంలో విద్యారులు హరిదాసు, గోపికల వేషధారణలతో అందరినీ అలరించారు.

ముగిసిన దివ్యాంగుల స్పోర్ట్స్ మీట్



కార్యక్రమంలో నిర్వాహకులు

అడయార్, జనవరి 11: దివ్యాంగుల కోసం ముక్తి ఎంఎస్ దాదా ఫౌండేషన్ నిర్వహించిన 'ఇన్‌క్లూసివ్ స్పోర్ట్స్ మీట్' విజయవంతంగా ముగిసింది. స్థానిక మీనంబాక్కంలోని ఏఎం జైన్ కాలేజీ మైదానంలో జరిగిన ఈ క్రీడల్లో పలువురు దివ్యాంగులు పాల్గొని వివిధ క్రీడా పోటీల్లో తమ సత్తా చాటారు. పోటీల ముగింపు వేడుకల్లో (స్పోర్ట్స్ మీట్)లో చొకియిల్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రదీప్ చొకియిల్, మెరిడియన్ గ్లోబల్ వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ వినోద్ సరోగి, మాస్టర్ చెఫ్ ఇండియా సీజన్-7 ఫైనలిస్ట్ అరుణ్ విజయ్, మోహన్ గోయెంకా ఫౌండేషన్ ఫౌండర్ మోహన్ జి గోయెంకా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముక్తి ఎంఎస్ దాదా ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ మీనా దాదా మాట్లాడుతూ... 'ఈ వేడుక విజయవంతంకావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఇది కేవలం ఒక స్పోర్ట్స్ మీట్ మాత్రమే కాదని, దివ్యాంగుల సామర్థ్యాన్ని, ఐక్యతను చాటిచెపుతూ వారి బలానికి స్ఫూర్తికి నిదర్శనమన్నారు.

ఎంవీఎం పాఠశాలలో ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు



సంక్రాంతి సంబరాల్లో ఎస్కేపీడీ ట్రస్టీలు, అధ్యాపకులు, విద్యార్థులు

ప్యారీస్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శ్రీకన్యకా పరమేశ్వరి దేవస్థానం (ఎస్కేపీడీ) ఛారిటీ నిర్వహిస్తున్న మహర్షి విద్యామందిర్ (ఎంవీఎం)లో శనివారం ఉదయం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రాంగణాన్ని అరటి, మామిడి తోరణాలు, ముగ్గులతో అందంగా తీర్చిదిద్దారు. అలాగే వేదికను చెరకు గడలతో అలంకరించి కొత్త మట్టి కుండలలో వండిన పొంగలిని అమ్మవారికి నివేదించి సుఖసంతోషాలు కలగాలని భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఎంవీఎం సీనియర్ సెకండరి పాఠశాల ప్రిన్సిపాల్ టి.సుబ్రమణ్యం ఆహ్వానం పలకగా, ముఖ్య అతిథులుగా ఎస్కేపీడీ ట్రస్టీలు ఎస్ఎల్ సుదర్శనం, దేసు లక్ష్మీనారాయణ హాజరయ్యారు. సాంస్కృతిక ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులను అభినందించి బహుమతులు పంపిణీ చేశారు. వైస్ ప్రిన్సిపాల్ ఎం.కవిత, మేనేజర్ శ్రీలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు సంక్రాంతి వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. జానపద పాటలకు ఉపాధ్యాయురాళ్లు వేసిన స్టెప్పులను చూసి విద్యార్థినులు కేరింతలతో సందడి చేశారు.

ఐసీటీ అకాడమీతో స్కూల్ ఆఫ్ డిజైన్ థింకింగ్ ఒప్పందం



కార్యక్రమంలో ఇరువర్గాల ప్రతినిధులు

అడయార్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): విద్యాసంస్థల్లో డిజైన్ ఆలోచనా శక్తిపై దృష్టిసారించి, మరింత బలోపేతం చేసేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన ఐసీటీ అకాడమీతో స్కూల్ ఆఫ్ డిజైన్ థింకింగ్ (ఎస్ఓడీటీ) అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. సమస్య పరిష్కారం, ఆవిష్కరణ కోసం డిజైన్ థింకింగ్‌ను ఒక విధానంగా ప్రోత్సహించేందుకు వీలుగా ఇది దోహదపడనుంది. ఐసీటీ అకాడమీ ఆఫ్ తమిళనాడుతో ఎస్ఓడీటీ ఈ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. వివిధ ప్రాంతాలు లేదా డొమైన్‌లలో డిజైన్ థింకింగ్ అప్లికేషన్ రంగంలో సహకారాన్ని ప్రోత్సహించడానికి, సహకార సంస్థాగత సంబంధాల కోసం ఫ్రేమ్‌వర్క్‌లను ఏర్పాటు చేయడం ఈ భాగస్వామ్య లక్ష్యం. ఈ ఒప్పందం పత్రాలపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, సమాచార, సాంకేతిక శాఖామంత్రి డాక్టర్ పళనివేల్ త్యాగరాజన్ సమక్షంలో రెండు సంస్థలకు చెందిన ఉన్నతాధికారులు సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ఉదయనిధి మాట్లాడుతూ, నూతన ఆవిష్కరణలతో పాటు విద్యార్థుల్లో ఆలోచనా పరిజ్ఞానాన్ని పెంపొందించే దిశగా ప్రభుత్వం అనేక వినూత్న కార్యక్రమాలను చేపడుతోందన్నారు.

లలిత కళా అకాడమీలో ఆర్టిస్ట్ ఎక్స్‌పో ప్రారంభం

చెన్నై, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన ఆర్టిస్టిక్ రూబెన్స్ సెంటర్ ఆధ్వర్యంలో లలిత కళా అకాడమీలో ఏర్పాటైన ఆర్టిస్టిక్ ఎక్స్‌పోను రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం ప్రారంభించారు. పాఠశాలల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్‌పొయ్యామొళి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ నెల 16 వరకు కొనసాగే ఈ ప్రదర్శనలో 50 మంది ప్రముఖ చిత్రకళాకారులకు చెందిన సంప్రదాయిక చిత్రలేఖనాలు ఉంటాయని ఆ సెంటర్ నిర్వాహకుడు ఎం.రూబెన్ తెలిపారు.



ఆర్టిస్ట్ ఎక్స్‌పోను ప్రారంభిస్తున్న మంత్రి సుబ్రమణ్యం



తిరునల్వేలి నుంచి పాదయాత్రగా వెళుతున్న మురుగప్పెరుమాన్ భక్తులు

తిరుచెందూరు ఆలయానికి భక్తుల పాదయాత్ర

చెన్నై, జనవరి11 (ఆంధ్రజ్యోతి): తిరుచెందూరు సెంథిల్ ఆండవర్ ఆలయానికి సంక్రాంతి సందర్భంగా సమీప జిల్లాల నుంచి భక్తులు పాదయాత్రగా ఆ దివ్యక్షేత్రానికి బయలుదేరుతున్నారు.తిరునల్వేలి,తూత్తుకుడి, తెన్‌కాశి, రాజపాళయంల నుంచి ప్రతిరోజూ వందల సంఖ్యలో భక్తులు శరీరానికి, నోటికి శూలాయుధాలు గుచ్చుకుని, కావళ్లు మోస్తూ పాదయాత్ర గా వెళ్ళి సంక్రాంతి రోజున స్వామివారిని దర్శించుకోవడం ఆనవాయితీ. ఆ ప్రకారమే శనివారం ఉదయం తిరునల్వేలి, తూత్తుకుడి నగరాల నుంచి భక్తులు పాదయాత్రగా తిరుచెందూరుకు పయనమయ్యారు. ఇప్పటికే తిరుచెందూరుకు కర్ణాటక,కేరళ, ఆంధ్రప్రదేశ్‌ల నుంచి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేయడంతో ఆలయం వద్ద రద్దీ అధికమైంది. స్వామివారిని దర్శించుకునేందుకు సుమారు నాలుగు గంటలసేపు క్యూలైన్లలో భక్తులు వేచి ఉండాల్సి వస్తోంది.

'స్కూల్ ఒలంపిక్స్'కు 1400 మంది విద్యార్థులు



నిర్వాహకులతో విజేతలు

చెన్నై, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కాసా గ్రాండ్ ఇంటర్నేషనల్ స్కూల్లో జరిగిన 'స్కూల్ ఒలంపిక్స్' 1వ ఎడిషన్‌కు రాష్ట్రం నలుమూలల నుంచి 77 పాఠశాలలకు చెందిన 1400 మంది విద్యార్థులు పాల్గొన్నారు. 1 నుంచి 12 తరగతుల వరకు పలువురు విద్యార్థులు వివిధ విభాగాల్లో పోటీ పడ్డారు. 50 మీటర్లు, 100 మీటర్లు, 600 మీటర్లు, 1500 మీటర్ల రన్నింగ్ రేసులు, లాంగ్ జంప్, షాట్‌పుట్ వంటి పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఒలంపిక్స్‌లో ఛాంపియన్‌కు రూ.20 వేలు, రన్నరప్‌కు పతకాలు, ట్రోఫీలు, సర్టిఫికెట్లతో పాటు రూ.10 వేల నగదు అందజేశారు. ఈ సందర్భంగా స్కూలు సీఈవో ద్వారకేష్ మాట్లాడుతూ.. శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, జట్టు కృషి, పట్టుదల వంటి విలువలను పెంపొందించడం ద్వారా యువ మనస్సులను తీర్చిదిద్దడంలో ఇలాంటి పోటీలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.

కోలాహలంగా తెప్పోత్సవం



పెరంబూర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లా ఓమలూరు సమీపంలోని సోర్నైమలై వెత్రాయ పెరుమాళ్ ఆలయ తెప్పోత్సవం కోలాహలంగా సాగింది. వైకుంఠ ఏకాదశి సందర్భంగా శుక్రవారం సాయంత్రం నిర్వహించిన ఈ వేడుకల్లో చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. మానత్తూల్ చెరువులో సాగిన ఈ ఉత్సవంలో ఒక తెప్పలో వేత్రాయ పెరుమాళ్, మరో తెప్పలో భామారుక్మిణి సమేత కృష్ణుడు ప్రత్యేక అలంకరణలో ఆశీనులను చేసి చెరువు చుట్టూ ప్రదక్షిణలు చేయించారు.

అరటిగెల రూ.1,150

ఐసిఎఫ్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పొంగల్ పండుగకు ముందే మదురైలో అరటి గెల ధరలు ఆకాశాన్నంటాయి. శుక్రవారం రూ.600గా ఉన్న ధర శనివారం ఒకేసారి రూ.550 పెరిగి రూ.1,150 పలికింది. దక్షిణాది జిల్లాలైన మదురై, తూత్తుకుడి, తిరునల్వేలి, తెన్‌కాశి, దిండుగల్, తేని, కన్నియాకుమారి తదితర జిల్లాల్లో రైతులు అధికంగా అరటి సాగు చేపడుతుంటారు. ఈ జిల్లాల నుంచి అరటి గెలలు, అరటి ఆకులు ఇతర జిల్లాలు, కేరళ రాష్ట్రానికి ఎగుమతి చేస్తుంటారు. ప్రస్తుతం పొంగల్ పండుగ సీజన్ కావడంతో ఆలయాల్లో పూజలకు అధికంగా అరటి పండ్లు వినియోగిస్తున్నారు. దీంత, ఒక్కసారిగా అరటి గెలల అధికమయ్యాయి. గత వారం అరటి గెల రూ.200 నుంచి రూ.300కు విక్రయం కాగా, శుక్రవారం రూ.600, శనివారం రూ.1150కి పెరిగింది. రాబోయే రెండు రోజుల్లో ధరలు మరింత పెరిగే అవకాశముండడంతో అరటి రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



మదురైలో అరటి పండ్ల మార్కెట్



శాస్త్రోక్తంగా చక్రస్నానం

అమ్మవారి ఆలయంలో ముగిసిన ముక్కోటి ఏకాదశి వేడుకలు

తిరుచానూరు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): వైకుంఠ ద్వాదశిని పురస్కరించుకుని శనివారం ఉదయం తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయంలో శాస్త్రోక్తంగా చక్రస్నానం నిర్వహించారు. వేకువజామున అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొల్పి అర్చకులు నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ఉదయం 7 గంటలకు ఆలయం నుంచి చక్రత్తాళ్వార్లను వేంచేపుగా పద్మ సరోవరంలోని(అమ్మవారి పుష్కరిణి) పంచమి తీర్థం మండపంలో కొలువుదీర్చారు. వేదమంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ చక్రత్తాళ్వార్లకు శాస్త్రోక్తంగా తిరుమంజనం నిర్వహించారు. పాంచరాత్ర ఆగమ శాస్త్రోక్తంగా చక్రత్తాళ్వార్‌ను అమ్మవారి పుష్కరిణిలో అర్చకులు మూడుసార్లు మునక వేయించారు. అశేష భక్తజనం పుణ్యస్నానాలు ఆచరించారు. దీంతో అమ్మవారి ఆలయంలో ముక్కోటి ఏకాదశి వేడుకలు ముగిశాయి. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో దేవరాజులు, ఏవీఎస్‌వో సతీష్‌కుమార్, అర్చకులు బాబుస్వామి, శ్రీనివాసులు, సూపరింటెండెంట్ రమేష్‌తో సుభాస్కర్‌నాయుడు, చలపతి, బ్రహ్మానందరాజు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.2.45 కోట్లు



తిరుమల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.2.45 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం లెక్కించింది. రూ.2.45 కోట్లు ఆదాయం లభించినట్లు టీటీడీ ఆదివారం ఉదయం ప్రకటించింది.

సేవాపథాన యువోత్సాహం

'కెరటం నాకు ఆదర్శం... పడుతున్నా మళ్లీ లేస్తున్నందుకు..' యువతకు మార్గనిర్దేశకుడిగా నిలిచిన స్వామి వివేకాందుడు చెప్పిన మాటలివి. రోజుకు ఒక్కసారైనామీతో మీరు మాట్లాడుకోండి.. లేకపోతే ఓ అద్భుతమైన వ్యక్తితో మాట్లాడే అవకాశాన్ని మిస్సవుతారంటూ ఆ మహనీయుడు తరతరాలకీ తరగని స్ఫూర్తిదాయకమైన మాటలెన్నో చెప్పారు. యువతరానికి ఆయన హితవచనాలు సన్మార్గాన్ని చూపుతాయి. బంగారు భవితకు బాటలు వేస్తాయి. అందుకే వివేకానందుడిని జయంతిని జాతీయ యువజనోత్సవంగా జరుపుకొంటున్నాం. ఆ మహనుభావుని మాటలతో స్ఫూర్తి పొంది ఉన్నత సమాజ నిర్మాణంలో తామూ భాగస్వాములు కావాలనే బలమైన సంకల్పంతో పనిచేస్తున్న ఈ ఇద్దరూ ఏమంటున్నారో తెలుసుకుందాం.

- గూడూరు అర్బన్ / తడ (ఆంధ్రజ్యోతి)



లేవండి..మేల్కొండి..
గమ్యం చేరేవరకూ విశ్రమించకుండి
హృదయానికి మెదడుకూ సంఘర్షణ తలెత్తితే
హృదయాన్నే అనుసరించండి
- స్వామి వివేకానంద

■ నేడు వివేకానందుని జయంతి



వివేకామాట.. చూపింది బాట..

మాది రాజస్థాన్‌లోని కోట జిల్లా ముంగేనా గ్రామం. 12వ తరగతి వరకు ఇటావా లోనే విద్యాభ్యాసం గడిచింది. 2017లో భోపాల్‌లోని ఎన్‌ఐటీలో బీటెక్ చేశాను. రిలయన్స్ ఇండియా లిమిటెడ్‌లో మంచి జీతంతో ఉద్యోగం వచ్చింది.నా లక్ష్యానికి అది సరికాదనిపించింది. ప్రజలతో మమేకమై సేవ చేయలనే లక్ష్యం ఉండేది. ఈ కారణంతోనే కొన్నాళ్ల ఆ ఉద్యోగం చేసి వదిలేశాను. ఢిల్లీ వెళ్లి సివిల్ సర్వీసెస్ కోచింగ్‌లో చేరాను. మొదటి ప్రయత్నంలో స్టేట్ సివిల్ సర్వీస్‌కు ఎంపికయ్యా. నాకు అది తృప్తినివ్వలేదు. అప్పుడే వివేకానందుడి స్ఫూర్తి మాటలు గుర్తుకొచ్చేవి. నాలో ఉత్సాహన్ని రగిలించేవి. 2021లో రెండవసారి ప్రయత్నించాను. 588 ర్యాంకుతో ఐపీఎస్ వచ్చింది. హైదరాబాద్‌లో శిక్షణకు జాయిన్ అయ్యాను. పోలీసుశాఖకే పరిమితం కావాలంటే మనసు అంగీకరించలేదు.వైద్యం, ఆరోగ్యం, విద్య తదితర రంగాల ద్వారా సేవచే యాలనే ఆకాంక్షకు దూరమయ్యానన్న బాధ వెంటాడేది. ఐపీఎస్ శిక్షణ పొందుతూనే మూడవ సారి సివిల్స్ రాశా. ఈ ప్రయత్నం ఫలించింది. 343 ర్యాంకుతో ఐఏఎస్‌కు సె లెక్టయ్యా. ఈ మూడు ప్రయత్నాల్లో నా సంకల్పానికి నాన్న, అమ్మ, తమ్ముడు, స్నేహితులు అండగా నిలిచారు. కెరీర్‌లో నేను అనుకున్న లక్ష్యాన్ని ఛేదించడంలో వివేకాకాందుడి మాటలు ఎంతగానే ప్రేరణగా నిలిచాయి. ఆయన తత్వం నా కెరీర్‌లో ప్రతి మెట్టునూ ప్రభావితం చేసింది. ఇప్పటి వరకు సమాజం నాకు చాలా ఇచ్చింది. ఇప్పుడు సమాజానికి ఎంతో చేయాలనుంది. 'లేవండి.. మేల్కోండి... గమ్యం చేరే వరకు విశ్రమించకండి. లక్ష్యంపై ఉన్నత శ్రద్ధ, ఆసక్తి లక్ష్యసాధనలో సైతం చూపించాలి.. అన్న మహనీయుడు వివేకానంద స్ఫూర్తిని నేటితరం మరువకూడదంటా.

- రాఘువేంద్ర మీనా, ఐఎఎస్,
గూడూరు సబ్‌కలెక్టర్




యువత రాజకీయాల్లోకి రావాలి

మాది నాయుడుపేట మండలం భీమవరం సొంతూరు. మా నాన్న సుబ్రహ్మణ్యం ఎంపీగా పనిచేశారు. రాజకీయాల్లో అడుగుపెట్టి సమాజాభివృద్ధికి కృషి చేయలనే సంకల్పం నాలో రగిలించారు. ఇదే సమయంలో వివేకానందుడి మాటలు నన్ను ఎంతగానో ప్రభావితురాలిని చేశాయి. ఆయన బ్యాంక్ అధికారిగా పనిచేసినా తరువాత రాజకీయాల్లోకి వచ్చి గ్రామాభివృద్ధికి తొడ్పడేవారు. నాకు చిన్నప్పటి నుంచి హాస్టల్ ఉండి చదువుకోవడం అలవాటైపోయింది. చదువుతో ఉన్నత స్థాయికి చేరి ప్రజలకు సహాయపడవచ్చని అమ్మానాన్నా చెప్పేవారు. ఆ మాటలు ప్రభావితం చేశాయి.ఎంబీబీఎస్ చదువుతున్నప్పుడు ఐదేళ్లూ పుస్తకాలే ప్రపంచంగా బతికాను. గత ఏడాది పీజీ ఎంట్రన్స్‌కు ప్రిపేరవుతున్న దశలో అనూహ్యంగా రాజకీయాలవైపు వచ్చాను.ఆ సమయంలో చంద్రబాబునాయుడి పోరాటపటిమ, మనోనిబ్బరం నాలో స్ఫూర్తిని నింపాయి. గతేడాది ఎన్నికల్లో టీడీపీ పక్షాన పోటీచేశాను. ఎమ్మెల్యేనయ్యాను. డాక్టర్ అంటే కొంతమందికే సేవచేసే అవకాశం ఉంటుంది. రాజకీయాల్లో అన్ని రంగాల వారికీ సేవచేసే వీలుంటుంది. ప్రస్తుత పరిస్థితుల్లో యువత రాజకీయాల్లోకి రావాలి. మెరుగైన సమాజ నిర్మాణానికి నడుం బిగించాలి. ప్రజలకు సేవచేసే అవకాశాన్ని యువతరం దూరం చేసుకోకూడదని అభిప్రాయపడుతున్నాను. ప్రతి సందర్భంలోనూ యువతరాన్ని ఉత్తేజితులను చేసి ముందుకు నడిపే వివేకానందుడి మాటలను తరచూ గుర్తు చేసుకుంటాను.

- నెలవల విజయశ్రీ, ఎమ్మెల్యే,
సూళ్లూరుపేట

దుబాయ్ రేసింగ్ పోటీలకు అజిత్ దూరం



చెన్నై, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): దుబాయ్ వేదికగా జరుగనున్న 'దుబాయ్ 24హెచ్ సిరీస్' రేసింగ్ పోటీల నుంచి తమిళ అగ్రహీరో అజిత్ కుమార్ తప్పుకున్నారు. ఈ మేరకు అజిత్ కుమార్ రేసింగ్ టీమ్ శనివారం అధికారికంగా వెల్లడించింది. ఈ రేసింగ్ పోటీల కోసం అజిత్ ప్రాక్టీస్ చేస్తుండగా ఇటీవల ఆయన కారు ప్రమాదానికి గురైన విషయం తెలిసిందే. ఈ ప్రమాదం నుంచి అజిత్ సురక్షితంగా బయటపడ్డారు. ఆ తర్వాత విస్తృతమైన చర్చలు, సంప్రదింపులు, అన్ని అంశాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసిన పిమ్మట 'అజిత్ కుమార్ రేసింగ్' జట్టు యజమానిగా, ఆ జట్టులో ఒక రేసర్‌గా వ్యక్తిగత, జట్టు శ్రేయస్సు దృష్ట్యా ఈ రేసింగ్ పోటీల నుంచి తప్పుకోవాలని నిర్ణయం తీసుకున్నట్లు అజిత్‌కుమార్ రేసింగ్ టీం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. ఇది వృత్తి నైపుణ్యం, వ్యక్తిగత ప్రయోజనాలనకు ప్రాధాన్యత ఇవ్వడంలో అజిత్ అచంచలమైన నిబద్ధతను తెలియజేస్తుందని, నిజమైన క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించే ఇటువంటి చర్యలు అతని జట్టుతో పాటు అభిమానులకు శాశ్వత ఊరట, సంతోషాన్ని కలిగిస్తాయని పేర్కొంది. అజిత్‌కు ఉన్న అపారమైన ఆదరణ, ఆయన అభిమానుల సంతోషాన్ని, కుటుంబ శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించింది.

విమాన సేవల్లో మార్పులు

పెరంబూర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): నగరంలో తెల్లవారుజామున కురుస్తున్న మంచు, సోమవారం జరుపుకోనున్న బోగీతో పొగలు కమ్ముకోవడం తదితర కారణాలతో ఈనెల 15వ తేది వరకు చెన్నైకి వచ్చే విమానాల సేవల్లో మార్పులు చోటుచేసుకున్నాయి. ఆ ప్రకారం, మస్కట్ నుంచి వచ్చే ఒమన్ ఎయిర్‌లైన్స్ విమానం, దుబాయ్ నుంచి వచ్చే ఎమిరేట్స్ ఎయిర్‌లైన్స్, కౌలాలంపూర్ నుంచి వచ్చే ఎయిర్ ఏషియా విమానాలు ఉదయం ఆలస్యంగా నగరానికి చేరుకొని, నిర్ణీత సమయంలోనే బయల్దేరి వెళ్లనున్నాయి. అలాగే, బ్రిటీష్ ఎయిర్‌వేస్, ఖతర్ ఎయిర్‌వేస్, ఎయిర్ అరేబియన్ ఎయిర్ లైన్స్, శ్రీలంకన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానాలు భోగి రోజున ఆలస్యంగా చేరుకోనున్నాయని అధికారులు తెలిపారు. కాగా, విమాన సమయాల్లో మార్పును రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికులకు ఈ-మెయిల్, మెసేజ్ ద్వారా తెలియజేసినట్లు వారు పేర్కొన్నారు.

ప్రారంభమైన 2 వారాలకే అద్దాలవంతెన పిట్టగోడ ధ్వంసం

చెన్నై, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక ప్రాంతం కన్నియాకుమారిలో తిరువళ్లువర్ విగ్రహ ప్రతిష్ఠాపన రజతోత్సవాల సందర్భంగా వివేకానంద స్మారక మండపం నుంచి ఆ విగ్రహం వరకు రూ.37 కోట్లతో రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన అద్దాల వంతెన పిట్టగోడ ధ్వంసమైంది. ఈ వంతెనపై ఈ నెల 4నుంచి పర్యాటకులు నడిచేందుకు అనుమతిస్తున్నారు. ఇప్పటి దాకా సుమారు యాభైవేలమంది అద్దాల వంతెనపై నడిచి వెళ్లినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం వివేకానంద స్మారక మండపం వైపు ఆ అద్దాల వంతెనకు ఓ వైపు పర్యాటకులు చేతిని ఆసరగా ఆనించే పిట్టగోడ పాక్షికంగా ధ్వంసమైంది. దీంతో బోట్ సవారీతో వివేకానంద స్మారక మండపానికి చేరుకున్న పర్యాటకులను ఆ అద్దాల వంతెనపై నడిచి వెళ్లేందుకు అధికారులు అనుమతించక పోవటంతో నిరాశ చెందారు. ప్రస్తుతం ప్రజాపనుల శాఖ ఇంజనీరింగ్ విభాగం అధికారులు ఆ పిట్టగోడ మరమ్మతులు చేపడుతున్నారు.



వంతెనపై జరుగుతున్న మరమ్మతులు

అవనిపై హరివిల్లు

విజయవాడలో సందడిగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీల ఫైనల్స్

ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్‌వారి పర్‌ఫెక్ట్, ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) ఫైనల్స్ శనివారం ఘనంగా జరిగాయి. విజయవాడలోని నారా చంద్రబాబు నాయుడు కాలనీలోని బ్యాడ్మింటన్ కోర్టులో నిర్వహించిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాలతో పాటు తమిళనాడు, కర్ణాటక విజేతలు కలిపి మొత్తం 15 మంది పాల్గొన్నారు. ప్రథమ బహుమతిని కె.భార్గవి (తమిళనాడు) సొంతం చేసుకోగా, మూడు ద్వితీయ బహుమతులను రమ్య (కడప), సావిత్రి (తూర్పు గోదావరి), వేణుభార్గవి (పశ్చిమ గోదావరి) సొంతం చేసుకున్నారు. మిగిలిన 11 మంది కన్సొలేషన్ బహుమతులు అందుకున్నారు. బహుమతుల ప్రదానోత్సవానికి హోంమంత్రి వంగలపూడి అనిత ముఖ్య అతిథిగా విచ్చేయగా, ఉమ్మడి కృష్ణా జిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ జ్యోతి వెలిగించి ఫైనల్స్ పోటీలను ప్రారంభించారు. ఏపీ సెంట్రల్ డెస్క్ ఇన్‌చార్జి టి.సురేష్, న్యూస్ ఎడిటర్ కె.నాగసుధాకర్, విజయవాడ యూనిట్ మేనేజర్ వి.మురళీ తదితరులు పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా అబ్బూరి రత్నలక్ష్మి, సూరపనేని ఉషారాణి వ్యవహరించారు.

- ఆంధ్రజ్యోతి, విజయవాడ

ప్రథమ బహుమతి గెలుచుకున్న తమిళనాడు మహిళ

కడప, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు ద్వితీయ బహుమతులు

11 మందికి కన్సొలేషన్ బహుమతులు

బహుమతులు ప్రదానం చేసిన హోంమంత్రి అనిత







ఫైనల్స్‌లో ముగ్గులు వేస్తున్న పోటీదారులు (ఇన్‌సెట్‌లో) పోటీదారులతో కలిసి జ్యోతి వెలిగిస్తున్న కృష్ణాజిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ

ఆంధ్రజ్యోతి
ABN
యవ్వనపు చర్మ రహస్యం
SANTOOR
సెల్సియా
BRA - PANTIES - SLIPS & LEGGINGS
TRADE ENQUIRY : 93445 53675
ఎటువంటి పంటలకైనా
క్రాఫ్ట్‌వారి పెర్‌ఫెక్ట్





ద్వితీయ బహుమతులు అందుకుంటున్న రమ్య (కడప), సావిత్రి (తూర్పు గోదావరి), వేణుభార్గవి (పశ్చిమ గోదావరి).. (కుడి నుంచి ఎడమకు), ముగ్గులు పరిశీలిస్తున్న మంత్రి అనిత





కన్సొలేషన్ బహుమతులు అందుకుంటున్న పి.జ్యోతి (శ్రీకాకుళం), ఎం.రాజు (విజయనగరం), నాగమల్లేశ్వరి (కృష్ణా), డి.ఉష (నెల్లూరు), కవిత (ప్రకాశం), ఏ.సునీత (గుంటూరు), జి.శ్రీలక్ష్మి (కర్నూలు), ఎస్.రమ్యకృష్ణ (అనంతపురం), రెడ్డిరాణి (చిత్తూరు), ఏ.సంతోషి (విశాఖపట్నం), రోహిణి (కర్ణాటక). చిత్రంలో ఏపీ సెంట్రల్ డెస్క్ ఇన్‌చార్జి టి.సురేష్, న్యూస్ ఎడిటర్ కె.నాగసుధాకర్, విజయవాడ యూనిట్ మేనేజర్ వేమూరి మురళీ, న్యాయనిర్ణేత అబ్బూరి రత్నలక్ష్మి